



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :60 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 10 జూలై 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## సింగరేణిలో క్రెడిట్ ఫైట్....



**మణుగూరు, జూలై 9:**తెలంగాణ ప్రజల, సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ నెరవేరింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని అత్యంత కీలకమైన తాడిచర్ల బొగ్గు బ్లాక్-2ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎలాంటి వేలం లేకుండానే నేరుగా ఈ మైన్‌ను కేటాయించడం సింగరేణి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. అయితే, ఈ కేటాయింపు ప్రకటన వెలువడిన క్షణం నుంచే తెలంగాణ రాజకీయాల్లో 'క్రెడిట్ వార్' ముదిరింది. "ఇది మా వల్లే సాధ్యమైంది" అంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, కేటాయింపులు చేసిన బీజేపీ నేతలు పోటాపోటీగా - మిగతా3లో

## గోశాలలతో హిందూ ఓటు బ్యాంక్ పై గురి

**కరీంనగర్ జూలై 9:**తెలంగాణ రాజకీయాల్లో సాంప్రదాయ కాంగ్రెస్ శైలికి భిన్నంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీపై ఉన్న మైనారిటీ అనుకూల ముద్రను పక్కనపెట్టి, తెలంగాణ సమాజంలో బలంగా ఉన్న హిందూ సెంటిమెంట్‌ను తన వైపు తిప్పుకునేందుకు ఆయన పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగమే ఇటీవల రేవంత్ రెడ్డి వేగవంతం చేసిన సాఫ్ట్ హిందూత్వ రాజకీయం. హిందూత్వ నినాదం, ఆ సెంటిమెంట్ పూర్తిగా భారతీయ జనతా పార్టీ కి అనుకూలంగా మారకుండా, రాష్ట్రంలోని హిందూ ఓటు బ్యాంకును కాపాడుకోవడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ఈ నయా మార్క్ పాలిటిక్స్‌ను తెరపైకి తెచ్చారని రాజకీయ విశ్లేషకులు



భావిస్తున్నారు. ఈ వ్యూహంలో - మిగతా3లో

## 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం



**: సీఎం రేవంత్**

**రంగారెడ్డి, జులై 9:** తెలంగాణలో బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(గురువారం)జిల్లా పర్యటనలో భాగంగా సీతారాంపూర్ ప్రీమియర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ అత్యాధునికి నెక్స్ట్ జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్ ఉందన్నారు. భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించామన్నారు. కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ రూపొందించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నామని సీఎం తెలిపారు. ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు కేటాయిస్తామన్నారు. ORR, RRR మధ్య పారిశ్రామికవాడలు ఏర్పాటు కానున్నాయన్నారు. RRR అవతల అగ్రి ఎకానమీ డెవలప్ చేస్తున్నామని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే ఉండాలన్నారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## మూసీ పునరుజ్జీవన పనులకు గ్రీన్ సిగ్నల్..



### రూ.7,345 కోట్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం

**హైదరాబాద్, జులై 9:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా.. మిగతా రూ.2,845.12 కోట్లు ఎవీణావా లేదా TGIIC నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ (EPC) విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (PMC) నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్ (MRDCL)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది

## తులం బంగారం హామీపై ఇంకెన్నాళ్లు...

**హైదరాబాద్, జూలై 9:**తెలంగాణ ప్రభుత్వం పథకాల అమలు విషయంలో ఇప్పటికే ఎన్నో విమర్శలు ఎదుర్కొటోంది. దానికి తోడు ప్రజలకు ఇస్తామని ప్రకటించిన తులం బంగారం హామీకి ఇప్పుడు తిలోదకాలు ఇచ్చారు. కల్యాణ లక్ష్మి పథకంలో భాగంగా పెళ్లికి తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టారు. ఈ పథకంపై పెళ్లిళ్లు చేసుకుంటున్న వారు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ఆయితే దాన్ని ఇవ్వలేమని బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాము హామీ ఇచ్చినప్పుడు రూ.యాభై వేలు ఉన్న బంగారం ధర - మిగతా3లో



## తెలంగాణకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ..



### రాబోయే ఏడు రోజుల పాటు వర్షాలు

**హైదరాబాద్, జులై 9:** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే వారం రోజుల వాతావరణ పరిస్థితిపై హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక ప్రకటన విడుదల చేసింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని - మిగతా3లో

## కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి ఇవ్వలేదు

**భట్టి విక్రమార్క**



**ఖమ్మం జిల్లా, జులై 9 :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## రైతుల ఉసురు తీస్తున్న రేవంత్ రెడ్డి..

**ఫర్టిలైజర్ ధరలను పెంచడంతో రైతులకు తీవ్ర నష్టం: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**





**సిద్దిపేట:**రేవంత్ రెడ్డి రైతుల ఉసురు తీసుకుంటున్నాడని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. చిన్నకోడూరు మండలం చంద్రాపూర్లో ఫర్టిలైజర్ దుకాణాన్ని గురువారం మాజీ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మొక్కజొన్న రైతు కనీసం నాలుగు బస్తాలు ఇవ్వాలి కానీ ప్రభుత్వం సరిపడ ఎరువులు సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రతి రైతుకు రెండు బస్తాలే ఇస్తామని అది కూడా మూడు విడుదల ఇస్తామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అన్ని - మిగతా3లో

## ఎల్‌నినోపై సర్కార్ అప్రమత్తం..

### ఎదర్కొనేందుకు సిద్ధం :మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జులై 9:** ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈరోజు(గురువారం) సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి ఉత్తమ్ అన్నారు. ప్రతి పరిస్థితిని ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నీనోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష జరపుతామన్నారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## సంపాదకీయం

# వయనాడ్‌కు ఈ పరిస్థితి ఎందుకు .?

కేరళలో ప్రకృతి ప్రకోపానికి శవాల దిబ్బగా మారిన ప్రాంతాల్లో.. అన్వేషణ, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదినక కొనసాగు తున్నాయి. బురద, శిథిలాల నుంచి భారీగా మృతదేహాలు బయటపడుతున్నాయి.: వయనాడ్ పశ్చిమ కనుమల అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థలో ఉంది. ఇక్కడి శిలలు ప్రీకాంబ్రియన్ యుగం నాటి గ్నైస్, స్కిస్ట్ రకానికి చెందినవి, ఇవి చాలా పెలుసుగా ఉంటాయి. ఈ శిలలలో సహజ పగుళ్లు ఉంటాయి, ఇవి వర్షపు నీరు పడ్డ తర్వాత బలహీనమవుతాయి. 2024 కొండచరియ విపత్తుకు ముందు 48 గంటల్లో, 572.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది, ఇది ఐఎండి అంచనా కంటే 200 శాతం ఎక్కువ. వయనాడ్‌లోని వైతిరి తాలూకాను పశ్చిమ కనుమల పర్యావరణవేత్తల ప్యానెల్ పర్యావరణ సున్నిత జోన్–1గా ప్రకటించినప్పటికీ, అభివృద్ధి పనులు ఆగకుండా కొనసాగాయి. హెచ్చరికలను పట్టించుకోలేదు: 2011లో, మాధవ్ గాడ్గిల్ కమిటీ పశ్చిమ కనుమలలోని సున్నితమైన ప్రాంతాల్లో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మైనింగ్‌పై తాత్కాలిక నిషేధాన్ని సిఫార్సు చేసింది. కేరళ ప్రభుత్వం ఆ నివేదికను పక్కన పెట్టింది. 2024 కొండచరియ విపత్తుకు 16 గంటల ముందు హ్యూమ్ సెంటర్ ఫర్ ఎకాలజీ ఒక హెచ్చరిక జారీ చేసింది, కానీ అది అధికారిక వ్యవస్థలో భాగం కానందున జిల్లా యంత్రాంగం దానిని విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం కూడా జూలై 23, 24, 25, 26 తేదీలలో భారీ వర్షాలు, కొండచరియ విపత్తుల గురించి హెచ్చరికలు జారీ చేసింది, కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. అభివృద్ధి పరుగులో పర్యావరణ నిర్లక్ష్యం: గత కొన్నేళ్లుగా వయనాడ్‌లో రిసార్ట్‌లు, రోడ్లు, పర్యాటక సౌకర్యాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. చెట్ల స్థానంలో కాంక్రీట్ కట్టడాలు వచ్చాయి. వర్షపు నీటి తీసుకునే భూమి తగ్గిపోయింది, అస్థిరమైన వాలులపై ఒత్తిడి పెరిగింది. సెప్టెంబర్ 2025 నాటి నివేదిక ప్రకారం, “వయనాడ్ కొండచరియ విపత్తు ప్రకృతి చర్య కాదు, అది మానవుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం ప్రత్యక్ష ఫలితం.” అని తేలింది. శిథిలాల కింద ప్రాణాలతో ఉన్నవారికోసం..రెస్క్యూ బృందాలు గాలిస్తున్నాయి. మరోవైపు ఈ జల ప్రళయానికి.. మానవుడి అత్యాశ, ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళలో విరిగిపడుతున్న కొండచరియలు.. ఊళ్లకు ఊళ్లనే నాశనం చేశాయి. వాయనాడ్‌లో ఇటీవల సంభవించిన ఘటనలో 295 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా..అనేక మంది ఆ శిథిలాల కిందే చిక్కుకుపోయారు. కనీవినీ ఎరుగని ఈ విపత్తుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ విడుదల చేసింది. అక్కడ సంభవించిన విలయాన్ని 3డీ రూపంలో చూపించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 86వేల చదరపు మీటర్ల భూభాగం జారిపడిపోయినట్లు ఇస్రో అంచనా వేసింది. సముద్రమట్టానికి 1,550 మీటర్ల ఎత్తులో ఈ కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని గుర్తించింది. వాయనాడ్‌లో చోటుచేసుకున్న భారీ వినాశనాన్ని అంచనా వేసేందుకు..కార్టోశాట్–3 శాటిలైట్‌తో పాటు ఆ ప్రాంతంలో అంతరిక్షం నుంచి తీసిన 3డీ చిత్రాలను ఇస్రో విశ్లేషించింది. గతంలోనూ అదే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన విషయాన్ని ఈ చిత్రాల్లో వివరించింది. కేరళలో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు వాయనాడ్ ప్రాంతం మొత్తం తడిగా మారిపోయిందని నిపుణులు చెబుతున్నారు.వాయనాడ్ జిల్లాలో ప్రకృతి సృష్టించిన విపత్తు ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గ్రామాలను నేలమట్టం చేసిన ఘటనలో..మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడటంతో మండక్కై, చూరాల్‌మల ప్రాంతాలు నామరూపాల్లేకుండా ధ్వంసమైపోయాయి. ముండక్కైలో 150 వరకు ఇళ్లు ఉండగా.. వాటిల్లో 65 పూర్తిస్థాయిలో నేలమట్టమయ్యాయి. శిథిలాలను తొలగిస్తే గానీ లోపల ఎంత మంది ఉన్నారనేది తెలియదని సహాయక బృందాలు చెబుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన భారత సైన్యం దాదాపు వెయ్యిమందికిపైగా స్థానికులను సురక్షితంగా కాపాడింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల నుంచి ప్రజలను రక్షించేందుకు సహాయక బృందాలు తాత్కాలిక వంతెనలను నిర్మించారు. రోడ్డు మార్గాలు ధ్వంసమై రాకపోకలకు వీలులేని ప్రాంతాల నుంచి వీటి ద్వారా ప్రజలను తరలిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఉపయోగించిన వీటిని.. బెయిలీ వంతెనలంటారు.వాయనాడ్‌లోని బాధిత ప్రాంతాల్లో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పర్యటించారు. కొండచరియలు విరిగిపడ్డ చురాల్‌మాల ప్రాంతాన్ని పరిశీలించారు. సహాయక చర్యలపై ఆరాతీశారు. రాహుల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీ , నేతలు కూడా కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. బాధితులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా కేరళ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు రాహుల్‌గాంధీ. కేంద్రం కూడా కేరళకు అండగా ఉండాలన్నారు. సహాయక శిబిరాల్లో ఉన్న వరదబాధితులను కూడా కలిశారు..రాహుల్ , ప్రియాంక. అటు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా వయనాడ్ వెళ్లి విపత్తు పరిస్థితిపై సమీక్షించారు.మరోవైపు మానవ చర్యల వల్లే కేరళలో తరచూ ఇలాంటి ప్రకృతి విపత్తులు జరుగుతున్నాయంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళకు పశ్చిమాన అరేబియా సముద్రంతో పాటు తూర్పున విస్తారమైన పశ్చిమ కనుమలు.. విస్తరించి ఉన్నాయి. వీటిని ఆస్వాదించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. దాంతో ఎకో టూరిజం పేరుతో హోటళ్లు, రిసార్టుల నిర్మాణం భారీగా జరుగుతోంది. ఇందుకోసం అడవులను కూడా విచ్చలవిడిగా నరికేస్తున్నారు. పర్యావరణపరంగా అత్యంత సున్నిత ప్రాంతమైన పశ్చిమ కనుమలు ఈ పరిణామాలతో తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. 2017, 2018, 2019ల్లో వరుసగా తుఫాన్లు, వరదలు కేరళను ముంచెత్తాయి. ఇప్పుడు వాయనాడ్ విధ్వంసం..కోలుకోలేని దెబ్బతీసింది.కేరళలోని వాయనాడ్, ఇడుక్కి జిల్లాల్లో కొండ ప్రాంతాలపై ఇటీవల నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడమే పెను సమస్యగా పరిణమించింది. వేసవిలో తీవ్రమైన ఎండలు, వర్షాకాలంలో మితిమీరిన వానలు పరిపాటిగా మారాయి. దాంతో కొండచరియలు విరిగిపడే ముప్పు నానాటికీ పెరుగుతోంది. బాగా ఎండిన నేలల్లో వాననీరు తక్కువగా ఇంకుతుంది. కొండల పైభాగంలో రాతి శిఖరాలను ఆవరించి ఉండే మట్టి పొరలు వదులుగా ఉంటాయి. భారీ వర్షాలకు తడిసి, వరద ఉధృతికి కొట్టుకుపోతాయి. తాజా విలయమే ఇందుకు ఉదాహరణ. గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా అత్యంత ఎక్కువ సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదైంది కేరళలోనే. దేశవ్యాప్తంగా 3 వేల 782 ఘటనలు జరిగితే..వాటిలో కేరళలోనే 2 వేల 239 ఘటనలు జరిగాయి. పర్యావరణ విధ్వంసంపై కేరళ ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే..వయనాడ్ ఘటనలు నిత్యకృత్యంగా మారుతాయని హెచ్చరిస్తున్నారు..పర్యావరణ వేత్తలు.

# ఇండియన్ రైల్వే... నాన్ స్టాప్

**ముంబై, జూలై 9:**భారతీయ రైల్వే మరో అద్భుతం చేసింది. ఇప్పటికే ప్రమాదాల నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుంది. రైల్వేకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో రైల్వే ట్రాక్లను పెంచుతుంది. కొత్త రైల్వే మార్గాలు ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో రైల్వే ఇంజనీరింగ్ వ్యవస్థ మరో అద్భుతం చేసింది.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ మరో ట్రైన్‌తో పక్కపక్క ట్రాక్‌లపై ఆగకుండా, వేగంగా పయనిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. గతంలో ఎక్స్‌ప్రెస్ లేదా వీఐపీ ట్రైన్లు వస్తే ఇతర ట్రైన్లను స్టేషన్ వద్ద నిలిపేసేవారు. ఇప్పుడు రెండు ట్రైన్లు స్వేచ్ఛగా, సురక్షితంగా వెళ్తున్నాయి. నెటిజన్లు దీన్ని “నయా భారత్.. పాత రోజులు పోయాయ్!” అంటూ ప్రశంసిస్తున్నారు. బీజేపీ కూడా ఈ వీడియోను ట్వీట్ చేసింది.వీడియోలో వందే భారత్ ట్రైన్ మరో సాధారణ ట్రైన్‌తో పక్కపక్కనే ట్రాక్‌పై దూసుకెళ్తున్న దృశ్యం కనిపిస్తుంది. రెండు ట్రైన్లు ఆగకుండా, ఒకదాని వేగాన్ని మరొకటి అడ్డుకోకుండా వెళ్తున్నాయి. దీన్ని చూసిన వారు “ఇది ఇంజనీరింగ్ మార్వెల్”, “పాత రోజులు పోయాయి”, “మోడర్న్ టెక్ సిగ్నలింగ్‌కు థాంక్స్” అని కామెంట్లు చేస్తున్నారు. ఈ వీడియో రైల్వే అభివృద్ధిని ప్రతిబింబిస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. భారతీయ రైల్వేల్లో మాన్యువల్ సిగ్నలింగ్ వ్యవస్థ ఉండేది.




ఎక్స్‌ప్రెస్ లేదా ముఖ్యమైన ట్రైన్లు రాగా, ఇతర ట్రైన్లను స్టేషన్ వద్ద ఆపేవారు. ఇది సేఫ్టీ కారణాలు, ప్రయారిటీ ఇవ్వడం, ట్రాక్ సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల జరిగేది. ఫలితంగా ప్రయాణ సమయం పెరిగేది, ట్రైన్ల సామర్థ్యం పూర్తిగా వినియోగం కాకుండా పోయేది. ఇప్పుడు పరిస్థితి మారింది. డబుల్ ట్రాకింగ్, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, కేంద్రీకృత ట్రాఫిక్ కంట్రోల్ వంటి ఆధునిక సాంకేతికతలు వచ్చాయి. ఇవి ట్రైన్లను ఒకదానితో ఒకటి సురక్షితంగా, సమన్వయంగా నడపడానికి వీలు కల్పిస్తున్నాయి. రెండు ట్రైన్లు పక్కపక్క ట్రాక్‌లపై ఆగకుండా వెళ్లడం ఇప్పుడు సాధారణం అవుతోంది.ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ రైల్వేల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. ట్రైన్ల మధ్య దూరం తగ్గించి, ఎక్కువ ట్రైన్లను నడపవచ్చు. మానవ తప్పిదాలు తగ్గుతాయి. వేగం పెరుగుతుంది, సమయం ఆదా అవుతుంది. సేఫ్టీ స్థాయి పెరుగుతుంది. వందే భారత్ వంటి సెమీ హై–స్పీడ్ ట్రైన్లు ఈ వ్యవస్థతో మరింత సమర్థవంతంగా నడుస్తున్నాయి. రైల్వేల్లో జరుగుతున్న సాంకేతిక విప్లవానికి ఇది మరో చిహ్నం.గత కొన్నేళ్లలో రైల్వేలు డబుల్ ట్రాకింగ్, ఎలక్ట్రిఫికేషన్, కొత్త ట్రైన్లు, స్టేషన్ల ఆధునీకరణ వంటి అనేక మార్పులు చేశాయి. ఫలితంగా ప్రయాణ సమయం తగ్గింది. ట్రైన్ల సంఖ్య పెరిగింది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయి. తాజాగా రెండు ట్రైన్లు ఆగకుండా వెళ్లడం రైల్వేల సామర్థ్యం, సేఫ్టీ, సాంకేతికత మూడూ మెరుగుపడ్డాయని అర్థం.ఈ వైరల్ వీడియో భారతదేశం ఆధునికీకరణ వైపు అడుగేస్తున్నట్లు చూపిస్తోంది. మోడర్న్ టెక్నాలజీ, మెరుగైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్ల ప్రజల జీవితాలు సులభతరం అవుతున్నాయి. ఇంకా మెరుగైన సిగ్నలింగ్ వ్యవస్థలు, హై–స్పీడ్ రూట్లు, మరిన్ని వందే భారత్ ట్రైన్లు వస్తే రైల్వేలు మరింత వేగవంతం, సురక్షితం అవుతాయి.

# బీజేపీకి చెక్ పెట్టేందుకే పీకే ప్లాన్

**పాట్నా జూలై 9:** తెరవెనుక ఉంటూ గొప్ప పొలిటికల్ స్ట్రాటజిస్టుగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ పెట్టి పెద్దగా సక్సెస్ కాలేదు. కానీ ఆయన గత ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఇప్పుడు తానే స్వయంగా ప్రత్యక్ష ఎన్నికల గోదాలోకి దూకారు. ఆయన స్థాపించిన జన సూరాజ్ పార్టీ కోర్ కమిటీ నిర్ణయం ప్రకారం.. బీహార్‌లోని అత్యంత హై–ప్రొఫైల్ అసెంబ్లీ స్థానమైన బాంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై, ఇటీవల రాజ్యసభకు వెళ్లిన సీనియర్ నేత నితిన్ నబీన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి జూలై 30, 2026 న ఉపఎన్నిక జరగనుంది. గత ఏడాది జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా పోటీ చేయడానికి వెనుకడుగు వేసిన పీకే.. ఇప్పుడు ఏకంగా బీజేపీకి కంచుకోట లాంటి స్థానంలో పోటీకి దిగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ప్రశాంత్ కిషోర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయ అనివార్యత దాగి ఉంది. గత 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ అంచనాలతో 238 స్థానాల్లో పోటీ చేసిన జన సూరాజ్ పార్టీ.. ఒక్క సీటులో కూడా గెలవలేక పూర్తిగా చాపచుట్టేసింది. ఈ ఘోర పరాజయం వల్ల పీకే సృష్టించిన పొలిటికల్ హైప్ ఒక్కసారిగా కరిగిపోయింది. పార్టీ ఉనికిని కాపాడుకోవాలన్నా, కేడర్‌లో తిరిగి ఉత్సాహం నింపాలన్నా తానే స్వయంగా యుద్ధరంగంలోకి రావాలని పీకే భావించారు. అందుకే, తదుపరి సార్వత్రిక పోరు దాకా ఆగకుండా, ఈ ఉపఎన్నికను తన రాజకీయ భవితవ్యానికి ఒక యాసిడ్ టెస్ట్ గా



మార్చుకున్నారు. 1990ల కాలం నుండి గతంలో పట్నా వెస్ట్ గా ఉన్న ఈ నియోజకవర్గం బీజేపీకి అల్ట్రా–సేఫ్ సీటు. నితిన్ నబీన్ ఇక్కడి నుండి వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పట్నా నగర పరిధిలోని అత్యంత ధనిక, విద్యావంతులైన ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కమలం జెండాను కాదని వేరే పార్టీ గెలవడం దాదాపు అసాధ్యమనే టాక్ ఉందిఅయితే, ఇంతటి కఠినమైన నియోజకవర్గాన్ని పీకే ఎంచుకోవడం వెనుక కూడా ఒక స్ట్రాటజిస్ట్ మైండ్ దాగి ఉంది. బాంకీపూర్‌లో బీహార్‌లోనే అత్యధికంగా అక్షరాస్యత రేటు ఉంది. ఇక్కడి ఓటర్లు కుల సమీకరణాల కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యార్హతలు చూసి ఓటు వేస్తారనే నమ్మకం పీకేకు ఉంది. బాంకీపూర్ ప్రజలు బీహార్‌లోనే అత్యంత చైతన్యవంతులు.. సరైన ప్రత్యామ్నాయం దొరికితే వారు మార్పు కోరుకుంటారు అని పీకే ఓటర్లను నేరుగా ఆకర్షిస్తున్నారు. పైగా, ఈ ఎన్నికను బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఆర్నెల్ల పాలనపై ఒక రెఫరెండం గా ఆయన అభివర్ణిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ ఓడిపోయినా బీజేపీ కోటలో గట్టి ఫైట్ ఇచ్చాం అని చెప్పుకోవచ్చు, పొరపాటున గెలిస్తే మాత్రం బీహార్ రాజకీయాల్లో జన సూరాజ్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందిప్రస్తుత గెలుపు అవకాశాలను అంచనా వేస్తే.. పీకేకు ఇది అత్యంత భారీ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో బీజేపీ ఓటు బ్యాంక్ ఇక్కడ చాలా పటిష్టంగా ఉంది. పీకే రాకతో కాంగ్రెస్ నాయకుడు రిషి మిశ్రా లాంటి వారు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ.. అధికారిక ప్రతిపక్షమైన ఆర్జేడీ –కాంగ్రెస్ కూటమి మహాగఠ్‌బంధన్ ఇక్కడ సొంత అభ్యర్థిని నిలబెడితే ఓట్లు చీలిపోయి బీజేపీకి మరింత లాభం చేకూరుతుంది. పైగా బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా పెట్టిన జన్శక్తి జనతా దళ్ తరపున సామాజిక కార్యకర్త వీణా మాన్విని బరిలోకి దించడం కమలదళానికి రూట్ క్లియర్ చేస్తోంది.ఆగస్టు 3న వచ్చే ఫలితాల్లో పీకే గనుక ఇక్కడ డిపాజిట్ కోల్పోతే.. కేవలం ఢిల్లీ ఏసీ రూముల్లో కూర్చుని స్క్రిప్టులు రాసే కార్పొరేట్ స్ట్రాటజిస్టే తప్ప, గ్రౌండ్ లెవెల్ లీడర్ కాదంటూ ప్రత్యర్థులు ఆయన్ను రాజకీయంగా సమాధి చేసే ప్రమాదం ఉంది. అలా కాకుండా బీజేపీ మెజారిటీని భారీగా తగ్గించినా, లేదా అద్భుతం జరిగి గెలిచినా.. 2025 పరాభవానికి పీకే సరైన రివెంజ్ తీర్చుకున్నట్లవుతుంది. ఈ చావో రేవో పోరాటంలో పీకే మైండ్ గేమ్ గెలుస్తుందా, లేక కమలం కోట నిలుస్తుందా అనేది బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత ఉత్కంఠ రేపుతోంది.

# చైనాకు చెక్ పెట్టినట్టేనా

**ఇటానగర్, జూలై 9:**ఇటీవల కాలంలో మన చుట్టూ ఉన్న సముద్ర ప్రాంతాలలో పట్టు సాధించడానికి చైనా అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తోంది. పాకిస్తాన్ దేశంతో దోస్తీ కడుతోంది. బంగ్లాదేశ్ తో కూడా మైత్రి కొనసాగిస్తోంది. చివరికి చిన్న చిన్న దేశాలను కూడా వదిలిపెట్టడం లేదు. తద్వారా భవిష్యత్ కాలంలో ఏవైనా పరిణామాలు జరిగితే.. మన దేశాన్ని ఇబ్బంది పెట్టడానికి చైనా అందించిన ఏ అవకాశాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. సహజంగానే చైనా దుర్మార్గమైన దేశం. తన ప్రయోజనాల కోసం ఏమైనా చేసే దేశం. అలాంటప్పుడు చైనాతో జాగ్రత్తగా ఉండాలి. చైనా తో స్నేహం కొనసాగించే దేశాలతో భారత్ మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇదే సమయంలో వ్యూహాత్మక ధోరణి ప్రదర్శించాలి.సరిగ్గా ఇదే ఆలోచనతో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇండోనేషియా దేశంలో పర్యటిస్తున్నారు. కీలకమైన ఒప్పందాలు చేసుకుంటున్నారు. అయితే అక్కడితోనే నరేంద్ర మోడీ ఆగిపోవడం లేదు. చైనాకు ఏకకాలంలో చెక్ పెట్టే విధంగా ఇండోనేషియాతో ఆయన ఒప్పందాలకు కుదుర్చుకున్నారు. ఇందులో ప్రధానమైనది మలక్కా జల సంధి వద్ద నిర్మిస్తున్న సబాంగ్ పోర్ట్.ఈ పోర్టును భారత్..



ఇండోనేషియా దేశాలు కలిసి సంయుక్తంగా నిర్మిస్తాయి. మలక్కా జల సంధి ద్వారా 40% గ్లోబల్ ట్రేడ్ జరుగుతుంది. చైనా టోటల్ మారీ టైం ట్రేడ్ 60 నుంచి 70% ఇక్కడ నుంచే సాగుతూ ఉంటుంది. ఈ జలసంధికి 100 మైళ్ళ దూరంలో భారత్.. ఇండోనేషియా కలిసి సభాంగ్ పోర్టు నిర్మిస్తున్నాయి. దీంతోపాటు భారత్ ఇండోనేషియా తో కలిసి అత్యంత వ్యూహాత్మకమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.. ఇటీవల కాలంలో హోర్మోజ్ జల సంధి మూతపడితే ప్రపంచం ఏ స్థాయిలో ఒత్తిడి ఎదుర్కొందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నేటి ఆధునిక కాలంలో కూడా చాలావరకు సరుకు రవాణా జల సందుల మీదుగానే సాగుతూ ఉంది. అలాంటప్పుడు వ్యూహాత్మకంగా పోర్టులు నిర్మించుకుంటే భవిష్యత్తు కాలంలో వచ్చే ఇబ్బందులను సులువుగా ఎదుర్కోవచ్చు.సబాంగ్ పోర్టు ద్వారా భారత చైనాకు చెక్ పెడుతుంది. ఎలాగంటే చైనాకు సంబంధించిన ట్రేడ్ లో సింహభాగం ఇక్కడి నుంచే కొనసాగుతూ ఉంటుంది. అలాంటప్పుడు భారత్ ఇక్కడ పోర్ట్ నిర్మిస్తే.. చైనా ఒకవేళ భవిష్యత్తు కాలంలో తోక జాడించే కార్యక్రమాలకు శ్రీకారం చుడితే.. భారత్ ఇక్కడ అడ్డుకోవచ్చు. ఫలితంగా చైనాకు వాణిజ్యపరంగా ఎదురు దెబ్బ తగులుతుంది. చైనా జుట్టు మన చేతిలో ఉండాలంటే కచ్చితంగా ఇండోనేషియా మనకు అనుకూలంగా ఉండాలి. అన్నిటికంటే ఇక్కడి పోర్టు మీద మన పెత్తనం ఉండాలి. అందువల్లే నరేంద్ర మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

# ఈనెల 14న మీనాక్షి నటరాజన్‌ను కలుస్తా

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య వివాదం ముదురుతోంది. దేవాదాయ శాఖతో పాటు జిల్లా రాజకీయాల్లో కడియం జోక్యం చేసుకోవడంపై మంత్రి సురేఖ సీరియస్‌గా ఉన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. ఈ వివాదంపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మంత్రి కొండా తాజాగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను మంత్రి సురేఖ వెల్లడించారు. తాను, తన భర్త ఇద్దరం కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటికి వెళ్లినట్లు సురేఖ వెల్లడించారు. అయితే, ఆయన తీరు చూస్తుంటే వివాదాన్ని పరిష్కరించడం, కలిసిపోవడం ఇష్టం లేనట్లుగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న తనను బయటకు రప్పించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై ఈ



నెల 14న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలుస్తానని మంత్రి వెల్లడించారు. మంత్రి చేయాల్సిన పనులు కడియం చేస్తానంటే ఎలా? అంటూ ఈ సందర్భంగా కొండా సురేఖ ప్రశ్నించారు. అధికారులను మూడు నెలలుగా కడియం ఒత్తిడి చేస్తున్నారని, అందువల్లే సమావేశంలో పాల్గొనాల్సి వచ్చిందని అధికారులు చెప్పారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌కు తన బాధ చెప్పుకున్నానని వెల్లడించారు. అన్ని విషయాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారిద్దరూ హామీ ఇచ్చారని తెలిపారు. తన జీవితమంతా ముళ్లబాటేనని ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల వ్యవహారంపైనా మంత్రి సురేఖ స్పందించారు. అయోధ్యలో శ్రీరాముడి పేరు చెప్పి దోచుకున్న వారిని ఆయనే శిక్షిస్తాడని ఆమె చెప్పారు.

# సోలార్ ఫెన్సింగ్ తో పంటలకు రక్షణ

**నల్గొండ, జూలై 9:**ఒకప్పుడు కోతులు, అడవి పందుల గుంపులు ఆ గ్రామాల్లోని రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసేవి. కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అడవి పందులు, కోతులు పొలాలపై పడి ధ్వంసం చేసేవి. ఈ విధ్వంసం కారణంగా పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. కానీ ఇప్పుడు ఆ రైతులకు వన్యప్రాణుల బెడద పూర్తిగా తొలగిపోయింది. సౌర విద్యుత్ కంచె సాంకేతికత వారి పంటలను కంటికి రెప్పలా కాపాడుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 30 మంది రైతులు సాధించిన ఉమ్మడి విజయమిది. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు, స్థానిక స్వచ్ఛంద సంస్థల ఉమ్మడి ఆర్థిక, సాంకేతిక సహకారంతో వారు తమ పొలాల చుట్టూ ఈ సౌరకంచెలను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలోని తుర్కపల్లి, భువనగిరి మండలాల్లో కోతులు, అడవి పందుల దాడితో రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్న తరుణంలో పిలుపు అనే స్వచ్ఛంద సంస్థ ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించింది. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న దుస్థితిని సవివరంగా నాబార్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై సానుకూలంగా స్పందించిన నాబార్డు అధికారులు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకొచ్చారు. ప్రాథమికంగా ప్రయోగాత్మక దశలో నలుగురు రైతులను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. ఒక ఎకరా భూమి చుట్టూ సౌరవిద్యుత్ కంచె ఏర్పాటు చేయడానికి మొత్తం రూ.30 వేలు ఖర్చు కాగా.. అందులో రూ.19 వేల మొత్తాన్ని నాబార్డు గ్రాంటుగా అందించింది. మిగిలిన రూ.11 వేల మొత్తాన్ని రైతులు తమ వాటా కింద భరించారు. రైతులకు కేవలం నిధులు ఇవ్వడమే కాకుండా సోలార్ ప్యానెల్, బ్యాటరీ, ప్రత్యేక



తీగలను కొనుగోలు చేసి ఇచ్చి వాటిని ఎలా నిర్వహించాలో శిక్షణ కూడా ఇచ్చారు. మొదటి విడత ప్రయోగం విజయవంతం కావడంతో.. ఆర్డీఎస్ఎస్, ఏఐడీ వంటి ఇతర స్వచ్ఛంద సంస్థలు దాతల సహాయంతో ముందుకు వచ్చాయి. వీటి సహకారంతో మరో 26 మంది రైతులు తమ పొలాలకు సౌరకంచెలను నిర్మించుకున్నారు. దీంతో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 30కి చేరింది. గత యాసంగి సీజన్‌లో ఈ కంచెల రక్షణలో రైతులు ధైర్యంగా కూరగాయలు, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. గత ఏడాది వన్యప్రాణుల దాడితో దెబ్బతిన్న అదే పొలాలు, ఈ ఏడాది పచ్చని పంటలతో, ఆశించిన ఫలసాయంతో కళకళలాడుతున్నాయి. తాము పండించిన పంట ఒక్క గింజ కూడా వృథా కాకుండా పూర్తిగా చేతికి దక్కుతోందని చుట్టుపక్కల గ్రామాల రైతులు సైతం తమ పొలాలకు వచ్చి ఈ సోలార్ కంచె పనితీరును ఆశ్చర్యంగా చూసి వెళ్తున్నారని కర్షలగడ్డ తండాకు చెందిన మహిళారైతు గుగులోతు శోభ ఆనందం వ్యక్తం చేశారుతెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం వన్యప్రాణుల సమస్య తీవ్రంగా ఉంది. కోతులు, అడవి పందులు వంటి జంతువుల కారణంగా రాష్ట్రంలో ఏటా దాదాపు 5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలకు భారీ నష్టం వాటిల్లుతోందని అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న, శనగ, వేరుసెనగ, చెరకు, జొన్న, సోయాబీన్, పొద్దుతిరుగుడు, కందులు, పెసలు, రకరకాల కూరగాయల తోటలు, పండ్ల తోటలు ఈ జంతువుల దాడికి తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. కేవలం పంటల నష్టమే కాకుండా.. పంటలను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్న రైతులపై ఇవి గుంపులుగా దాడులు చేస్తున్నాయి. ఈ తరహా దాడుల వల్ల గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో 40 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ సౌర విద్యుత్ కంచె సాంకేతికత అత్యంత సురక్షితమైనది. పొలం చుట్టూ అమర్చిన తీగలను కోతులు, అడవి పందులు తాకగానే తక్కువ తీవ్రత కలిగిన విద్యుత్ షాక్ తగిలి అవి దూరంగా పారిపోతాయి. అదే సమయంలో పొలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అలారం మోగటం వల్ల జంతువులు భయపడి ఆ పరిసరాల్లోకి రావడానికే సాహసించడం లేదు. ఈ వ్యవస్థలు పగటితో పాటు రాత్రి వేళల్లోనూ సమర్థవంతంగా పనిచేస్తాయి. అన్నింటికంటే ముఖ్యంగా.. ఈ కంచెల ద్వారా వన్యప్రాణులకు ఎలాంటి ప్రాణహాని జరగదు, కేవలం అవి భయపడి దూరంగా వెళ్తాయి. గతంలో రాత్రంతా నిద్ర లేకుండా కాపలా కాసే రైతులు ఇప్పుడు కంటినిండా నిద్రపోతున్నారు. ఈ విధానం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఒక ప్రత్యేక సోలార్ ఫెన్సింగ్ పాలసీని తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

# పతాక స్థాయికి చేరుతున్న లొల్లి

**హైదరాబాద్, జూలై 9:**తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో గత కొంతకాలంగా అంతర్లీనంగా సాగుతున్న అధికార ఆధిపత్య పోరు ఇప్పుడు బహిర్గతమై పతాక స్థాయికి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు, కేంద్రీకృత పాలనా శైలి క్యాబినెట్ సహచరుల్లో తీవ్ర అసహనానికి దారితీస్తోంది. కీలక వ్యవహారాల్లో తమకు కనీస ప్రాధాన్యత ఇవ్వకపోవడం, తమను కాదని ఇతర నేతలను సీఎం ప్రోత్సహిస్తున్నారనే భావన సీనియర్ మంత్రుల్లో గట్టిగా నాటుకుపోయింది. ఈ క్రమంలోనే మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖల తాజా వ్యూహాత్మక అడుగులు కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్ లోకి నెట్టడమే కాకుండా, వివాదాన్ని ఢిల్లీ దాకా తీసుకెళ్లాయి. ఈ అంతర్గత రచ్చకు మొదటి కేంద్రబిందువుగా మారారు ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు. తన పరిధిలోకి రాని ఆర్థిక శాఖా పరమైన అంశాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఆయన విసిరిన బహిరంగ సవాల్ చివరకు కాంగ్రెస్ మెడకు చుట్టుకుంది. తెలంగాణ భవన్‌కు వస్తానంటూ జూపల్లి చేసిన ఛాలెంజ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు అత్యంత వ్యూహాత్మకంగా వాడుకుని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. "వ్యక్తిగతంగా సవాల్ విసిరినప్పుడు నేరుగా వెళ్లి తేల్చుకోవాలి కానీ, మొత్తం పార్టీని డిఫెన్స్‌లో పడేయడం ఏంటి?" అని అంతర్గత సమావేశాల్లో అసహనం వ్యక్తం చేసినట్లు లీకులు వచ్చాయి. సీఎం వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన జూపల్లి, సోమవారం స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పర్యాటక శాఖ అధికారిక సమీక్షా సమావేశానికి ఉద్దేశపూర్వకంగానే డుమ్మా కొట్టారు. అంతటితో ఆగకుండా, అదే సమయంలో కొల్లాపూర్ బావిలో



తాను హ్యాపీగా ఈత కొడుతున్న వీడియోలను సోషల్ మీడియాలో వదలడం ద్వారా.. తానేంటో సీఎంవోకు పరోక్షంగా ఒక బలమైన పొలిటికల్ సిగ్నల్ పంపారు. మరోవైపు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం ముఖ్యమంత్రి వైఖరిపై తీవ్ర అసంతృప్తితో, ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో కడియం శ్రీహరి ప్రాధాన్యతను వ్యతిరేకిస్తూ ఆమె గతంలోనే అసంతృప్తి లేఖ రాసినప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి కడియంకు వెన్నుదన్నుగా నిలవడం ఆమెకు మింగుడుపడటం లేదు. దీనికి తోడు, తన పరిధిలోని దేవాదాయ శాఖకు చెందిన అత్యంత కీలకమైన యాదగిరిగుట్ట ఆలయ బోర్డు ఏర్పాటు, చైర్మన్ నియామకం వంటి నిర్ణయాల్లో కనీసం మంత్రిగా ఉన్న తనకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా సీఎంవో ఏకపక్షంగా ఆర్డర్స్ పాస్ చేయడం ఆమెను తీవ్ర అవమానానికి గురిచేసింది. ఇప్పటికే వరంగల్ గ్రూపు రాజకీయాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో, స్థానిక ఎమ్మెల్యేలతో కొండా కుటుంబానికి గ్యాప్ నడుస్తోంది. ఇప్పుడు ఏకంగా సీఎంవోనే తన శాఖలో నేరుగా జోక్యం చేసుకోవడంపై తీవ్ర కలత చెందిన కొండా సురేఖ.. రాష్ట్ర నాయకత్వం అనుసరిస్తున్న తీరును ఎండగడుతూ ఏఐసీసీ హైకమాండ్‌కు నేరుగా ఒక ఘాటు లేఖ రాయడానికి సిద్ధమవ్వడం కాంగ్రెస్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. నిజానికి తెలంగాణ కాంగ్రెస్ కేబినెట్‌లో ఈ స్థాయి గ్యాప్ రావడానికి సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న కేంద్రీకృత అధికార శైలి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీలో దశాబ్దాలుగా ఉన్న సీనియర్లు, తాము రేవంత్ కంటే సీనియర్లమని భావించే మంత్రులు సీఎంవో నుంచి వచ్చే కఠిన ఆదేశాలను, నియామకాలను అంత సులభంగా తీసుకోలేకపోతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ వంటి వారు సైతం కొన్ని విషయాల్లో అసంతృప్తితో ఉన్నప్పటికీ, వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. కానీ, జూపల్లి, కొండా సురేఖలు మాత్రం తమ అసంతృప్తిని ప్రత్యక్షంగా, పరోక్షంగా బయటపెట్టి తిరుగుబాటు జెండా ఎగరేశారు. గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో సొంత క్యాబినెట్ సహచరుల మధ్య సమన్వయం దెబ్బతినడం, ఏకంగా ఢిల్లీ అధిష్ఠానానికి లేఖలు రాసే పరిస్థితి రావడం రేవంత్ రెడ్డి లీడర్‌షిప్‌కు ఒక సవాల్‌గా మారింది. మరి ఈ అంతర్గత మంటలను చల్లార్చడానికి ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగి సర్దుబాటు చేస్తారా.. లేక రాబోయే రోజుల్లో జరిగే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఈ అసంతృప్త నేతలకు గట్టి చెక్ పెడతారా అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.

# విద్యార్థుల ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్:**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మనం కాంపిటీటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయి ప్రభుత్వ అసమర్థత వల్ల పేపర్ లీక్ అయితే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. రాహుల్ గాంధీసరైన విద్యా విధానం రావాలని ఈ పోరాటంలో విద్యార్థులంతా భాగస్వామ్యం కావాలని తల్లిదండ్రుల సూచనల తో భవిష్యత్ భారత దేశ నిర్మాణం ఉండాలని విద్యా విధానంలో మార్పులు రావాలని కోరుకుంటున్నాం. ప్రపంచలో ఏదైనా మార్చగలిగే శక్తి విద్యార్థి లోకానికి ఉంది ఆనాడు కాలేజీ ఎన్నికల్లో విద్యార్థి



నాయకుడిగా గెలిచి అధ్యక్షుడిగా, ఎంపీగా, మంత్రి మీతో మాట్లాడుతున్న ఎంతటి శక్తినైనా మనం మార్చగలుగుతాం కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ అమిత్ షా ల నాయకత్వంలో జరుగుతున్న అవినీతి, పేపర్ లీకేజీ ల, రాజ్యాంగం కాపాడుకుంటూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ భాగస్వామ్యం కావాలి. పేపర్ లీకేజీ కి బాధ్యత వహించి దేశంలో విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, విద్యార్థుల భవిష్యత్తు కి రాహుల్ గాంధీ పోరాటంలో అందరం భాగస్వామ్యం కావాలి.

# సింగరేణిలో క్రెడిట్ ఫైట్...

- మొదటి పేజీ తరువాయి

క్లెయిమ్ చేసుకుంటున్నారు. గోదావరి లోయ బొగ్గు గనుల పరిధిలోని ములుగు కోల్ బెల్ట్ వాయువ్య ప్రాంతంలో తాడిచర్ల బ్లాక్-2 విస్తరించి ఉంది. దాదాపు 1,875 హెక్టార్ల పరిధిలో విస్తరించిన ఈ బ్లాక్‌లో భారీ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. ఈ బ్లాక్‌లో దాదాపు 182 మిలియన్ టన్నుల నుంచి 434 మిలియన్ టన్నుల వరకు నాణ్యమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. ఇందులో లభించే బొగ్గు అత్యంత నాణ్యమైన జీ-8, జీ-9 గ్రేడ్‌కు చెందినది. ఇది ఎన్టీపీసీ, కేటీపీపీ వంటి భారీ విద్యుత్ కేంద్రాలకు ఎంతో అనుకూలం. ఈ గని ద్వారా ఏటా 5 నుంచి 6 మిలియన్ టన్నుల బొగ్గును 40-50 ఏళ్ల పాటు ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా రూ.64,000 కోట్లకు పైగా ఆదాయం, సుమారు 1,200 నుండి 3,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. గతంలో తాడిచర్ల బ్లాక్-1ను టీజీ జెన్కోకు కేటాయించగా, బ్లాక్-2 కోసం కూడా జెన్కో ప్రయత్నించింది. కానీ, అంతిమంగా కేంద్రం దీన్ని సింగరేణికే దక్కేలా చేసింది. ఈ కేటాయింపు ఫైలుపై ప్రధాని నరేంద్ర మోదీ అనుమతితో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సంతకం చేశారు. 2020 నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు వేలం లేకుండా నేరుగా గనులు కేటాయించే పద్ధతి నిలిచిపోయినప్పటికీ, సింగరేణి కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు బీజేపీ చెప్తోంది. వేలం పాట లేకపోవడం వల్ల సింగరేణికి సుమారు రూ.2,550 కోట్ల ఆక్షన్ ప్రీమియం మిగిలిందని, రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి రూ.16,000 కోట్లు వస్తాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తాము తెలంగాణ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని, గతంలో ఏ ముఖ్యమంత్రి లేఖలు రాసినా సాధ్యం కానిది తాము చేసి చూపించామని బీజేపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరంతరం జరిపిన పోరాటాలు, కేంద్రంతో జరిపిన సంప్రదింపుల వల్లే ఇది సాధ్యమైందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీ స్థాయిలో గట్టి ఒత్తిడి తెచ్చారని, వేలంలో కాకుండా నేరుగా కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి పంపిన ప్రతిపాదనల వల్లే కేంద్రం దిగివచ్చిందని కాంగ్రెస్ వాదిస్తోంది. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సైతం ఈ క్రెడిట్ రేసులో వెనక్కి తగ్గడం లేదు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాడిచర్ల బ్లాక్-2ను సింగరేణికి ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానాలు చేశామని, కేంద్రానికి వందలాది లేఖలు రాశామని గుర్తు చేస్తోంది. కార్మిక సంఘాల ద్వారా క్షేత్రస్థాయిలో తాము చేసిన ఆందోళనల ఫలితంగానే నేడు కేంద్రం ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని బీఆర్ఎస్ వాదిస్తోంది. కాంగ్రెస్ కేవలం ఇప్పుడొచ్చి బిల్డప్ ఇస్తోందని గులాబీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. పొలిటికల్ క్రెడిట్ వార్ ఎలా ఉన్నప్పటికీ, వేలం ప్రక్రియ లేకుండా తాడిచర్ల-2 దక్కడం సింగరేణి ఆర్థిక పురోగతికి ఊపిరి పోసినట్లయింది. అయితే ఈ బ్లాక్‌లో ఎక్కువ భాగం అటవీ భూమి కావడంతో.. మైనింగ్ ప్లాన్, ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లు సాధించి పూర్తిస్థాయిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## గోశాలలతో హిందూ ఓటు బ్యాంక్ పై గురి

- మొదటి పేజీ తరువాయి

అత్యంత కీలకమైన మైలురాయి.. నూతన సచివాలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక నల్లపోచమ్మ ఆలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించాలని నిర్ణయించడం, దానికి సంబంధించిన పనులను స్వయంగా పర్యవేక్షించడం. గతంలో నిర్మించిన సచివాలయ ఆలయాల కంటే మిన్నగా, తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ఈ గుడిని తీర్చిదిద్దుతున్నారు. కేవలం నల్లపోచమ్మ ఆలయమే కాకుండా, సచివాలయంలోని శివాలయం, ఇతర అనుబంధ గుడుల పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తాము హిందూ ధర్మానికి బీజేపీ మాత్రమే హక్కుదారు కాదనే బలమైన సంకేతాన్ని పౌర సమాజంలోకి సీఎం రేవంత్ బలంగా పంపగలిగారు. హిందూ సమాజంలో అత్యంత పవిత్రంగా భావించే గోరక్షణపై రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో, ప్రభుత్వ సహకారంతో వేల సంఖ్యలో అత్యాధునిక గోశాలల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా అజెండా ఏమిటో తెలియచెప్పారు. దీనికి అదనంగా.. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన దేవాదాయ భూముల పరిరక్షణపై రేవంత్ రెడ్డి ప్రత్యేక నిఘా విభాగాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రముఖ ఆలయాలకు చెందిన వేలాది ఎకరాల భూములు కబ్జా కాకుండా డిజిటల్ మ్యాపింగ్ చేయించడం, వివాదాస్పద భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు శ్రీకారం చుట్టారు. అలాగే, యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి కొత్త పాలకమండలిని ఏర్పాటు చేసి, తిరుమల తరహాలో అటానమస్ బోర్డును తీసుకురావాలని భావించడం వెనుక కూడా దేవాలయాల స్వయంప్రతిపత్తిని గౌరవిస్తామనే సందేశం దాగి ఉంది. భద్రాచలం, వేములవాడ, జోగులాంబ గద్వాల వంటి చారిత్రాత్మక ఆలయాల అభివృద్ధికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించడం రేవంత్ వ్యూహాత్మక పంథాకు అద్దం పడుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 8 స్థానాలు గెలుచుకుని, ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకోవడమే రేవంత్ రెడ్డి ఈ రూట్ మార్చడానికి ప్రధాన కారణం. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ పరిసర జిల్లాల్లో హిందూ ఓటర్లు కాషాయం వైపు ఆకర్షితులవుతున్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికలు స్పష్టం చేశాయి. ఈ ఓటు బ్యాంక్ మరింతగా చేజారితే రాబోయే గ్రేటర్ హైదరాబాద్ , వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. అందుకే, బీజేపీ కేవలం మాటలతో హిందుత్వ రాజకీయం చేస్తుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం ప్రభుత్వ నిధులు, అధికారిక కార్యక్రమాల ద్వారా 'చేతల హిందుత్వాన్ని' ప్రదర్శిస్తూ కమలదళం ఆయుధాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఈ సాఫ్ట్ హిందుత్వ వ్యూహం కాంగ్రెస్‌కు రాజకీయంగా శ్రీరామరక్షగా మారుతుందా లేదా అనేది రాబోయే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు తేల్చనున్నాయి. ఒకవైపు మైనారిటీ ఓటు బ్యాంకు దూరం కాకుండా చూసుకుంటూనే, మరోవైపు హిందూ సెంటిమెంట్‌ను గౌరవించడం అనేది కత్తిమీద సామే అయినప్పటికీ.. రేవంత్ రెడ్డి తన మార్క్ దూకుడుతో దాన్ని విజయవంతంగా నడిపిస్తున్నారు. ఈ వ్యూహం గనుక క్షేత్రస్థాయిలో పక్కాగా వర్కవుట్ అయితే, తెలంగాణలో తామే ప్రత్యామ్నాయం అని భావిస్తున్న బీజేపీకి ఇది గట్టి ఎదురుదెబ్బే అవుతుంది.

## తెలంగాణకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ..

- మొదటి పేజీ తరువాయి

పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. దాదాపు ఏడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం సాధారణంగా మబ్బు పట్టి ఉంటుందని, పగటి ఉష్ణోగ్రతలు కూడా స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. వాతావరణంలో వస్తున్న ఈ మార్పుల నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వాతావరణం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. వర్షం కురిసే సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర తెలంగాణలో గాలుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ సహా పరిసర జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది.

## తులం బంగారం హామీపై ఇంకెన్నాళ్లు...

- మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు లక్ష దాటిందని అందుకే ఆ ఖర్చును ప్రభుత్వం భరించలేదని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు తులా బంగారం ఇస్తామని ప్రచారం చేసింది, కానీ అధికారంలోకి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ "ఇవ్వలేము" అని చెప్పడం విపక్షాలకు ఆయుధంగా మారింది. "ఎన్నికల సమయంలో 'బంగారం' ఇస్తామని చెప్పి, పాలిత తర్వాత 'బడ్జెట్ లేకపోతుంది' అనడం మోసం" అంటూ **BRS** నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు 'ప్రాక్టికల్ కాదు' అంటూ తప్పించుకోవడం మహిళలను మోసంమ చేయడం అనే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. తెలంగాణలో పెళ్లి సమయంలో మహిళలకు ఆర్థిక సహాయం అవసరమని కల్యాణ లక్ష్మి పథకం రూపొందింది. పేద కుటుంబాల్లో పెళ్లి ఖర్చులు 5-10 లక్షలకు చేరుకుంటాయి.. ఈ ఖర్చులో బంగారానికి ఎక్కువ వాటా. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా తులం బంగారం ఇస్తే ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. కానీ ప్రభుత్వం తమకు ఆర్థిక భారమని తప్పించుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి నేతలు ఇప్పటికే విమర్శలు ప్రారంభించారు. "కాంగ్రెస్ ఎన్నికల ముందు 'బంగారం' చెప్పి, ఇప్పుడు 'ఇవ్వలేము'.. మహిళలను మోసం చేస్తున్నారు" అని కేటీఆర్ మండిపడ్డారు. మహిళల పథకాలు 'పేపర్ ప్రామిస్‌లు' మాత్రమే" అని విమర్శిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన తర్వాత తీవ్రమైన విమర్శలు వస్తున్నా ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో మహిళల్ని విపరీతంగా ఆకర్షించిన అంశాల్లో తులం బంగారం పథకం కూడా ఒకటి. ఆ పథకం ప్రకటన వల్ల మహిళల ఓట్లు పెద్ద ఎత్తున పడి ఉంటాయని అంచనాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ పథకాన్ని ఇవ్వలేమంటే ప్రజలు ముఖ్యమంగా మహిళలు అసంతృప్తికి గురవుతారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'కల్యాణ లక్ష్మి పథకం' పెళ్లి సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే ముఖ్యమైన స్కీమ్. **SC/ST/BC/EWS/**మైనారిటీలకు చెందిన అమ్మాయిల పెళ్లికి రూ. 1,00,116 సహాయం ఇస్తుంది. 2014లో కేసీఆర్ హయాంలో ప్రారంభమయింది. పేద కుటుంబాల్లో అమ్మాయిల పెళ్లి ఖర్చులు తగ్గించడం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. 2014 నుంచి 10 లక్షలకు అమ్మాయిలకు పెళ్లిళ్లకు సాయం చేశారు. ఈ పథకానికి మరింత వాల్యూ యాడ్ చేసి ఓట్లు సంపాదించాలనుకున్న కాంగ్రెస్.. తులం బంగారం ప్రకటన చేసి ఇరుక్కుపోయింది. ఇప్పుడు పథకం ఇవ్వకపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిలయినట్లే అవుతుంది.

## రైతుల ఉసురు తీస్తున్న రేవంత్ రెడ్డి..

- మొదటి పేజీ తరువాయి

రకాల ఎరువుల ధరలు విపరీతంగా పెంచడంతో రైతులకు పెను భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రైతులకు సరిపడా యూరియా అందుబాటులో నిలువలు ఉంచుకోక పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతుల బాధలు ప్రభుత్వం అర్థం చేసుకోక పోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే యాప్ రద్దు రైతులకు నేరుగా యూరియాను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు అందించే యూరియా పై సీలింగ్ ఎత్తివేయాలని అన్నారు. రైతులకు ఎంత యూరియా అవసరమైతే అంత సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, అల్లిపూర్ సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, గంగాపూర్ సొసైటీ మాజీ చైర్మన్ కనకరాజు, మాజీ ఎంపీటీసీ దుర్గారెడ్డి, చంద్రమౌళి, బిఆర్ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, రాచకొండ లింగం, రాచకొండ బిక్షపతి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మందుల సామేల్ కు వ్యతిరేకం కాదు...

**ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్:**తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిణామాలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి స్పందించారు. ఎంపి మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలి. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య మనస్పర్థలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే ముందుల సామెల్ కు,ఎంపీగా నాకు ఎలాంటి పొలిటికల్ బ్యాగ్రౌండ్ లేదు.అయినా కాంగ్రెస్ కార్యకర్తలు అక్కున చేర్చుకుని మమ్మల్ని గెలిపించారు. నేను ఎమ్మెల్యే మందుల సామేల్ కు వ్యతిరేకం కాదని అన్నారు.నేను తుంగతుర్తి నియోజకవర్గంలో మండల అధ్యక్ష పదవికి,పీఏసీఎస్ చైర్మన్ పదవికి,మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి ప్రమోట్ చేయలేదు. కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎవరిని కోరుకుంటే వారికే పదవులు ఇద్దామని మందుల సామేల్ తో చెప్పాను. మందుల సామేల్ తీసుకునే నిర్ణయానికి నేను వ్యతిరేకం కాదు. నేను విదేశాల్లో ఉన్నప్పుడు మండల అధ్యక్షులను ప్రకటించారు.దీనిపై నాకు కాంగ్రెస్ కార్యకర్తలు ఫోన్ చేశారు. ఇదే అంశాన్ని నేను పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకువెళ్ళాను.నిర్ణయం తీసుకున్నారు.ప్రకటన ఆపాలని కోరానని అన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వంత మండలం తిరుమలగిరి,నా స్వంత మండలం శాలి గౌరారం తుంగతుర్తిలోనే ఉన్నాయి. సూర్యాపేట,యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షులు,పార్లమెంట్ అబ్జర్వర్ తో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తామని చెప్పాను. మండల స్థాయిలో కార్యకర్తలు ఎవరికి ఎక్కువ సపోర్ట్ చేస్తే వారికే అవకాశం ఇద్దాము. పదవుల కోసం రోడ్డు ఎక్కి కొట్టుకుంటే ప్రజల్లో చులకన అవుతాము. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ క్యాడర్ సమన్వయం పాటించాలని అన్నారు.మనకు పదవులు వచ్చాయి. మన గెలుపు కోసం పని చేసిన క్యాడర్ ను పట్టించుకోవాలి. చామల కిరణ్ కుమార్ రెడ్డి ఏ వర్గానికి,ఏ కులానికి,ఏ మతానికి వ్యతిరేకం కాదు,అన్యాయం చేయాలనే ఆలోచన లేదు. ప్రజలు నమ్మకంతో మమ్మల్ని గెలిపించారు.అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మాపైన ఉందని అన్నారు.

## సింగరేణి డిమాండ్లపై ఈనెల 20 నుంచి నిరవధిక దీక్ష: కవిత



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 9:** సింగరేణి బాయి బాటలో భాగంగా కార్మికులతో మమేకమవుతున్నట్లు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ విధానాలు, బకాయిల వల్ల సింగరేణిపై పెను భారం పడుతోందన్నారు. సింగరేణిలో ఆర్థిక సంక్షోభంతో పని ముట్లు కొనలేని దుస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఓ రూల్, కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం తీరు ఉందని మండిపడ్డారు. తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు 62 వేల రెగ్యులర్ కార్మికుల సంఖ్య ఉండేదని.. నేడు 38 వేలకు తగ్గిందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం నెలలో రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డ్ ద్వారా వారసత్వ ఉద్యోగాలు కొనసాగించాలన్నారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం డిపెండెంట్లపై స్పష్టత ఇవ్వకపోతే ఈనెల 20 నుంచి రామగుండంలో నిరవధిక దీక్ష చేపట్టి తీరుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు.. వివరణ పేరుతో నాటకాలు ఆడుతున్నారని టీఆర్ఎస్ చీఫ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ అకౌంట్‌లో ఉన్న రూ.1400 కోట్లు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని.. ఆ నిధులపై విచారణ జరిపి ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. కంఠంలో ప్రాణం ఉండగా బీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తే లేదని కవిత తేల్చిచెప్పారు.

## రైతుల ఖాతాల్లోకి రూ.361.41 కోట్లు



**వికారాబాద్:** వానాకాలం పంటల సాగుకు సంబంధించిన పెట్టుబడి సాయం నిధులు విడతల వారీగా రైతుల బ్యాంకుల ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతు భరోసా పథకం కింద బుధవారం వరకు జిల్లా వ్యాప్తంగా 2,75,567 మంది రైతుల ఖాతాల్లో రూ.361,41,55,892 నిధులు జమ చేశారు. తొలి రోజు ఎకరా లోపు ఉన్న అన్నదాతల ఖాతాల్లో భరోసా నిధులు జమ కాగా, తర్వాత వరుసగా రోజుకు ఒక ఎకరా పెంచుతూ రెండు నుంచి, ఏడు ఎక రాల వరకు విస్తీర్ణం కలిగిన రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులు జమ చేశారు. పంటలు సాగుకు సన్నద్ధమయ్యే సమయంలో ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయడం పట్ల అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## శంషాబాద్లో బొలెరో వాహనం బీభత్సం

**రంగారెడ్డి:**శంషాబాద్ లో బొలెరో వాహనం బీభత్సం సృష్టించింది. బస్సు కోసం ఎదురు చూస్తున్న మహిళలపైకి దూసుకెళ్లింది. ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. సత్తం రాయి వద్ద బస్ స్టాప్లో ఎదురు చూస్తున్న మహిళలపైకి మిర్చి లోడ్తో వెళ్తున్న బొలెరో వాహనం దూసుకెళ్లింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఇదే ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, జీబ్రా క్రాసింగ్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించాలి

**ఎంపి అరవింద్**

**నిజామాబాద్:**ఎస్ ఐ ఆర్ అంశంపై ఇందూర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లతో సమావేశమై, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎంపి అరవింద్ ధర్మపుఇఉ దిశానిర్దేశం చేసారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని సూచించాను. ప్రతి డివిజన్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్త, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, ఇందూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నిన్న సురేఖ.. ఇవాళ జూపల్లి

## మంత్రుల మధ్య సమన్వయలోపం...



**హైదరాబాద్, జూలై 9:**తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు, మంత్రుల మధ్య సమన్వయ లోపం ఇప్పుడు పతాక స్థాయికి చేరినట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదని మంత్రులు అసంతృప్తికి గురవుతున్నారు. అదే సమయంలో మంత్రులను కాదని ఇతర నేతల్ని ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు కూడా మూటగట్టుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పలువురు సీనియర్ మంత్రులకు గ్యాప్ పెరిగింది. ముఖ్యంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ వ్యవహారాలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్‌లోకి నెట్టేయడమే కాకుండా, ఢిల్లీ దాకా వివాదం ముదిరేలా చేస్తున్నాయి.ఈ వివాదాల పరంపరలో మొదటగా ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఇరుక్కుపోయారు. తన పరిధిలో లేని ఆర్థిక శాఖ వ్యవహారాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు సవాల్ విసిరి, తెలంగాణ భవన్‌కు వస్తానని ఛాలెంజ్ చేయడం జూపల్లికి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ అవకాశాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు అత్యంత తెలివిగా వాడుకుని కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లో పడేశారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ.. ఛాలెంజ్ చేసినవాడు నేరుగా చర్చకు వెళ్లి తేల్చుకోవాలి కానీ, పార్టీని ఇరకాటంలో పెట్టడం ఎందుకు అని అంతర్గత సమావేశాల్లో వ్యాఖ్యానించినట్లు లీకులు వచ్చాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన జూపల్లి, సోమవారం సీఎం నిర్వహించిన పర్యాటక శాఖ అధికారిక సమీక్షకు కూడా డుమ్మా కొట్టి, కొల్లాపూర్ బావిలో ఈత కొడుతున్న వీడియోలు రిలీజ్ చేశారు. మరోవైపు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. కడియంపై అసంతృప్తి లేఖ రాసినప్పటికీ..కడియంకు సీఎం ప్రోత్సాహం ఉందని ఆమె నమ్ముతున్నారు. అదే సమయంలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు ఏర్పాటు, చైర్మన్ నియామకం వంటి అంశాల్లో కనీసం దేవాదాయ శాఖ మంత్రి అయిన తనకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై ఆమె కినుక వహించినట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర క్యాబినెట్‌లో ఏకైక బీసీ మహిళా మంత్రిగా ఉన్న తనను ఒకేసారి రెండు ప్రధాన అంశాల్లో టార్గెట్ చేస్తూ, తీవ్ర అవమానానికి గురిచేస్తున్నారనే భావనలో కొండా సురేఖ ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోనూ వరంగల్ రాజకీయాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో, స్థానిక ఎమ్మెల్యేలతో కొండా కుటుంబానికి గ్యాప్ వచ్చింది. ఇప్పుడు ఏకంగా తన స్వంత శాఖలోనే ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా జోక్యం చేసుకుంటూ బోర్డులను ఖరారు చేయడంపై ఆమె తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఈ వరుస పరిణామాలతో తీవ్రంగా కలత చెందిన కొండా సురేఖ.. రాష్ట్ర నాయకత్వం తీరుపై నిరసన తెలుపుతూ ఏఐసీసీ హైకమాండ్‌కు నేరుగా ఒక ఘాటు లేఖ రాయడానికి సిద్ధమవుతున్నట్లు పార్టీ అంతర్గత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ గ్యాప్ రావడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న సెంట్రలైజ్డ్ పవర్ శైలియేనని తెలుస్తోంది. కాంగ్రెస్‌లో సుదీర్ఘ కాలంగా ఉన్న సీనియర్ నేతలు, తాము రేవంత్ కంటే సీనియర్లమని భావించే మంత్రులు.. సీఎంవో నుంచి వచ్చే ఆదేశాలను సులభంగా జీర్ణించుకోలేకపోతున్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ వంటి వారు కూడా కొన్ని విషయాల్లో అసంతృప్తితో ఉన్నప్పటికీ బహిర్గతం చేయడం లేదు. కానీ జూపల్లి, కొండా సురేఖలు తమ అసంతృప్తిని పరోక్షంగా, ప్రత్యక్షంగా బయటపెట్టడం చర్చనీయాంశమైంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల మధ్య అంతర్గత సమన్వయం పూర్తిగా దెబ్బతిన్నదనే విషయాన్ని ఈ తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో.. క్యాబినెట్ సహచరులే ఇలా తిరుగుబాటు జెండా ఎగరేయడం, లేఖలు రాయడం రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు సవాల్‌గా మారింది. మరి ఈ అంతర్గత చిచ్చును అధిష్ఠానం జోక్యం చేసుకుని సద్దుమణిగేలా చేస్తుందా.. లేక రాబోయే రోజుల్లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ద్వారా అసంతృప్తులకు చెక్ పెడతారా అనేది వేచి చూడాల్సిందే.

# ఆ ముగ్గురికి ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు



**హైదరాబాద్ జూలై 9:**తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బీఆర్ఎస్ పార్టీని వెంటాడుతూనే ఉంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన ఈ అక్రమ ఫోన్ ట్యాపింగ్ ఉదంతం, రోజుకో మలుపు తిరుగుతూ చివరకు పార్టీ అగ్రనాయకత్వం వైపునకు దూసుకువస్తోంది. తాజాగా ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తీసుకున్న ఒక కీలక నిర్ణయం బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్య నేతలను నిందితులుగా చేరుస్తూ సిట్ తుది నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తోంది.ఈ అక్రమ వ్యవహారానికి సంబంధించిన దర్యాప్తును దాదాపుగా కొలిక్కి తెచ్చిన సిట్, నిందితుల జాబితాలో కొత్తగా ఈ ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యులను చేరుస్తూ సప్లిమెంటరీ చార్జ్‌షీట్ సిద్ధం చేసింది. దీనిపై ఇప్పటికే న్యాయ నిపుణుల ఆమోదం కూడా లభించినట్లు తెలుస్తోంది. సాధారణంగా కేసుల విచారణ మధ్యలో కొత్త నిందితులను చేర్చాల్సి వచ్చినప్పుడు న్యాయస్థానంలో మెమో దాఖలు చేయడం ఒక పద్ధతి. సిట్ కూడా ముందస్తు జాగ్రత్తగా ఈ అభియోగపత్రంతో పాటే కోర్టులో మెమో దాఖలు చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంది. సాంకేతికపరమైన అనుమతులు కూడా లభించడంతో, ఈ ముగ్గురిపై అధికారికంగా చట్టపరమైన చర్యలు ముందుకు పడనున్నాయి.సిట్ దర్యాప్తులో తేలిన గణాంకాలు, తేదీలు ఈ కేసు తీవ్రతను కళ్ళకు కడుతున్నాయి. ముఖ్యంగా 2023 నవంబరు 15 నుంచి నవంబరు 30వ తేదీ వరకు కేవలం 15 రోజుల వ్యవధిలోనే స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా ఈ ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత ఉధృతంగా సాగినట్లు సిట్ గుర్తించింది. ఈ స్వల్ప వ్యవధిలోనే ఏకంగా 4,013 మందిపై నిఘా ఉంచినట్లు దర్యాప్తులో తేలింది. వీరిలో 618 మందికి సంబంధించిన ఫోన్ సంభాషణలను అత్యంత అక్రమ పద్ధతిలో వినేందుకు ఎస్ఐబీ ప్రయత్నించిందని ఆధారాలతో సహా నిరూపితమైంది. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల వ్యూహాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ భారీ ట్యాపింగ్ నెట్‌వర్క్ పనిచేసిందని స్పష్టమవుతోంది.ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ సీహెచ్ఓ టి.ప్రభాకర్ రావు నియామకం వెనుక ఉన్న మతలబులను సిట్ మొదటి నుంచీ అనుమానిస్తూనే ఉంది. విచారణలో భాగంగా ప్రభాకర్ రావు ఇచ్చిన సమాచారంతో పాటు, గత ప్రభుత్వంలో కీలక విభాగాల్లో పనిచేసిన ఉన్నతాధికారుల వాంగ్మూలాలు బీఆర్ఎస్ ముఖ్యులకు ఉచ్చుగా మారాయి. గత ప్రభుత్వంలో సీఎంఓ, హోంశాఖలో పనిచేసిన ఉన్నతాధికారుల నుంచి సిట్ ఇటీవలే కీలక వాంగ్మూలాలను సేకరించింది. తమపై ఉన్నతాధికారులు, రాజకీయ పెద్దల ఒత్తిడి వల్లే, వారి ఆదేశాల మేరకే తాము పనిచేయాల్సి వచ్చిందని పోలీసు ఉన్నతాధికారులు ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఒక మాజీ డీజీపీతో పాటు ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన ఒక ఉన్నతాధికారి ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యుల పాత్రపై సిట్ స్పష్టమైన ఆధారాలు సేకరించగలిగింది.అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఆ ముగ్గురు నేతల పాత్ర ఏమిటనేది సిట్ తన అభియోగపత్రంలో క్షుణ్ణంగా పొందుపరిచింది. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీకి అందిన ఎలక్టోరల్ బాండ్ల విషయంలో, నిధుల సమీకరణలో అక్రమ నిఘా ఏ విధంగా ఉపయోగపడిందనే కోణంలో ఒక ప్రముఖుడి పాత్రపై గట్టి ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. ఎవరిపై అక్రమంగా నిఘా ఉంచాలి, ఎవరి డేటా సేకరించాలి అనే విషయాలపై నేరుగా ఆదేశాలు ఇచ్చిన వారిపై సిట్ ఆధారాలను క్రోడీకరించింది. అయితే, ఇదే కేసులో గతంలో విచారణను ఎదుర్కొన్న ఒక కీలక మాజీ ప్రజాప్రతినిధికి మాత్రం ఈ అభియోగపత్రంలో ఉపశమనం లభించినట్లు తెలుస్తోంది. గతంలో ఆయనను విచారించినప్పటికీ, ప్రస్తుతానికి ఆయన పేరును నిందితుల జాబితాలో చేర్చలేదని సమాచారం.మొత్తంగా చూస్తే, ఒకప్పుడు కేవలం అధికారుల చుట్టూనే తిరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు, ఇప్పుడు నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతల గుమ్మం తొక్కడం ఆ పార్టీకి రాజకీయంగా పెద్ద దెబ్బేనని చెప్పవచ్చు. దర్యాప్తు సంస్థల వద్ద ఉన్న పక్కా ఆధారాలు, అధికారుల వాంగ్మూలాల నేపథ్యంలో ఈ ఫోన్ ట్యాపింగ్ భూతం బీఆర్ఎస్ పార్టీని రాబోయే రోజుల్లో మరింత తీవ్రంగా వెంటాడటం ఖాయంగా కనిపిస్తోంది.

# తెలంగాణ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు

## పర్మినెంట్ ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాల భర్తీ
## రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండానే నియామకాలు
## పదో తరగతి మార్కుల ఆధారంగా ఉద్యోగాలు



నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతుండగా... చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణలో పర్మినెంట్ (శాశ్వత) ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం విశేషం. ఈ నోటిఫికేషన్‌లో అభ్యర్థులకు ఊరటనిచ్చే అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడం లేదు. కేవలం టెన్త్ క్లాస్ లో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఎలాంటి పోటీ పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే సువర్ణావకాశం కావడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పర్మినెంట్ బేసిస్‌పై కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా చాలా మంది ఉద్యోగులు రిటైర్ కావడంతో ఖాళీలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇప్పటివరకు తాత్కాలికంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బస్సులను నడిపించారు. ఇప్పుడు నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి రావడంతో ఆర్టీసీ రూపురేఖలు మారనున్నాయి. అయితే, అఫీషియల్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక చిన్న సాంకేతిక సమస్య ఎదురైంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా.. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు జీపీఏ గ్రేడింగ్ విధానాన్ని తెచ్చింది. మళ్లీ ఇటీవల మార్కుల విధానాన్ని కొనసాగిస్తోంది. దీనివల్ల అప్లై చేసుకునే అభ్యర్థుల్లో కొందరికి మార్కులు, మరికొందరికి కేవలం గ్రేడింగ్ మాత్రమే సర్టిఫికేట్లలో ఉన్నాయి. దీంతో జీపీఏ గ్రేడింగ్‌ను మార్కుల శాతంలోకి ఎలా కన్వర్ట్ చేయాలి? ఇరు విధానాల అభ్యర్థులను సమానంగా ఎలా అంచనా వేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు ఎస్ఎస్‌సీ బోర్డుకు లేఖ రాశారు. బోర్డు నుంచి ఈ మార్గదర్శకాలు అందిన వెంటనే కండక్టర్ ఉద్యోగాల అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.

# పెట్టుబడుల పేరుతో మోసం..

**ఫిఫా ప్రసార హక్కుల సంస్థకు రూ.2 కోట్ల టోకరా**



**హైదరాబాద్, జూలై 9:** పెట్టుబడుల పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఫిఫా వరల్డ్ కప్ ప్రసార హక్కులు పొందిన మెటాలాయిడ్ సంస్థను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల మోసానికి పాల్పడిన ఘటనపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్వెస్టర్ల కోసం చూసిన మెటాలాయిడ్ సంస్థను అమెరికాకు చెందిన దిలీప్ అనే వ్యక్తం మోసం చేశాడు. అమెరికాకు చెందిన అప్నీ అనే సంస్థ ప్రతినిధి దిలీప్.. మెటాలాయిడ్ సంస్థలో 50 మిలియన్ అమెరికన్ డాలర్లు పెట్టుబడి పెడతానని నమ్మించిన వైనం వెలుగులోకి వచ్చింది. ఇందుకు కోసం బ్యాంక్ గ్యారంటీలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు ఖాతాల వివరాలను సంస్థకు చూపించాడు దిలీప్.దిలీప్ అందజేసిన బ్యాంక్ గ్యారంటీలు నకిలీవని తేలడంతో మెటాలాయిడ్ సంస్థ మోసపోయినట్లు గుర్తించింది. ఈ వ్యవహారం వల్ల సంస్థకు సుమారు రూ.2 కోట్ల నష్టంతో పాటు సంస్థ ప్రతిష్ఠను దిగజార్చారని మెటాలాయిడ్ యాజమాన్యం ఆరోపించింది. ఈ మేరకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు సంస్థ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పెట్టుబడుల పేరుతో మోసానికి ఉపయోగించిన పత్రాలు, బ్యాంక్ గ్యారంటీలు, ఆర్థిక లావాదేవీలపై పోలీసులు విచారణ చేపట్టారు.

# నిందితుల అరెస్టు బంగారు వెండి స్వాధీనం

**అనుమానితుల సమాచారం పోలీసులకు అందించాలి**
**సీసీ కెమెరాలతో నేరాలను నిరోధించవచ్చు**
**డి.ఎస్.పి బుర్రి శ్రీనివాస్ యాదవ్**

**నాగర్ కర్నూల్ జులై 9 (స్కైన్యూస్)** రాష్ట్ర పరిధిలో సుమారు 25 దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి 19 తులాల బంగారాన్ని 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు గురువారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 అక్టోబర్ 27న నియోజకవర్గం పరిధిలోని తిమ్మాజీపేట మండలం గొరిట గ్రామానికి చెందిన ధర్మారెడ్డి తన ఇంట్లో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టడం జరిగిందని వివరించారు. వనపర్తి గ్రామానికి చెందిన అంజి అదే గ్రామానికి చెందిన జలగిరి ముత్తు నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన జలగిరి బాబు లను జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కి ఆవరణలో అదుపులోకి తీసుకొని విచారించి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన వివరించారు. వీరిలో అంజి మరియు జలగరి బాబులు దొంగతనాలు చేయడంలో



ఎంతో నైపుణ్యం ఉందని ఆయన వివరించారు.ధర్మారెడ్డి ఇంట్లో నాలుగు బంగారు గాజులు ఒక నక్లెస్ ఒక నల్లపూసల దండ నాలుగు బంగారు ఉంగరాల తో పాటు బంగారు గొలుసు చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందంగానే తెలిపారు. మీరంతా గ్రామాలలో పర్యటిస్తూ తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యం చేసుకుని చోరీలకు పాల్పడతారని వివరించారు. వీధి నుండి తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో 13 తులాల బంగారాన్ని నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఆరు తూలాల బంగారం 20



తూలాల వెండిని భోజనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎవరైనా అనుమానితులు సంచరిస్తూ ఉంటే వారి వివరాలను పోలీసులకు తెలపాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని నేరాలను తగ్గించుకోవాలని సూచించారు నిందితులను అరెస్టు చేయడంలో సీఐ అశోక్ రెడ్డి నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్ తెలకపల్లి ఎస్సై రమేష్ తిమ్మాజీపేట ఎస్సై శ్రీనివాసరావు లు చాకచక్యంగా వ్యవహరించారని వివరించారు ఈ కేసు పరిశోధనలలో సహకరించిన సిబ్బంది భీముడు వెంకటేష్ రమేష్ లను అభినందించారు

# నిరంతర పోరాటాలతో విద్యార్థుల గుండెల్లో ఏబీవీపీ...

**నాగర్ కర్నూల్ జులై 9 (స్కై న్యూస్)** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మరియు జాతీయ సమైక్యత కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించడం ద్వారా దేశంలో ఏబీవీపీ అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఆవిర్భవించి విద్యార్థుల గుండెల్లో శరగని ముద్ర వేసుకుందని తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ సూరంపల్లి సుధాకర్ ఏబీవీపీ




జిల్లా కన్వీనర్ శాంతం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు అన్నారు గురువారం ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు అనంతరం వారు మాట్లాడుతూ గత 78 సంవత్సరాలుగా ఏబీవీపీ ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించడంతో పాటు హక్కులను సాధించడం జరిగిందని వివరించారు. ఐదు మంది విద్యార్థులతో ఏర్పడిన ఏబివిపి కన్యాకుమారి వరకు 78 లక్షల సభ్యత్వంతో ముందుకు సాగుతుందని వివరించారు. విచారంగా సమస్యలతో పాటు ఆర్టికల్ 360 రద్దుకై పోరాటం చేయడం జరిగిందని తెలిపారు రాష్ట్రాలలో వామపక్ష విదేశీ పుత్రులను ఎదుర్కొని ఎందరో ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. అనేకమంది నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలను త్యాగం చేసిన ఏబీవీపీ చదువుతోపాటు పోరాటాలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తుందని వివరించారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ నాయకులు శివ భరత్ డానియల్ శివ జీవన్ సందీప్ విష్ణు కీర్తన కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

# నులి పురుగుల దినోత్సవన్ని విజయవంతం చేయాలి...

**హెల్త్ అసిస్టెంట్ కూన గోవర్ధన్**

**నాగర్ కర్నూల్ జులై 9( స్కై న్యూస్)** 13 నుండి 19 వరకు నిర్వహించే నూలి పురుగుల వారోత్సవాన్ని విజయవంతం చేయాలని హెల్త్ అసిస్టెంట్ కూన గోవర్ధన్ కోరారు గురువారం బిజినేపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రమించే పలు వ్యాధుల లక్షణాలను వివరించారు. వ్యాధులు సోకిన సందర్భంలో అధైర్య పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నులి పురుగులు అపరిశుద్ధ ప్రాంతాలలో మానవ మలములో ఉన్న గుడ్ల ద్వారా బట్టి కలుషితమై మట్టి ద్వారా వ్యాప్తి చెందుతాయని ఆ మట్టిలో విద్యార్థులు ఆడుకోవడం ద్వారా చేతి వేళ్ళు నోట్లో పెట్టుకోవడం వల్ల



వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఆకుకూరలు మరియు పళ్ళు శుభ్రం చేసుకోకుండా తీసుకోవడం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుందని అన్నారు. వ్యాధి సోకిన వారిలో రక్తహీనత ఆకలి మందగించడం కడుపులో నొప్పి రావడం మలద్వారం దగ్గర దురద వాంతులు విరోచనాలు బలహీనంగా కనిపించడం జరుగుతుందని వివరించారు. వ్యాధిని నివారించేందుకు పాదరక్షలు ధరించాలని మలవిచార్జిన తర్వాత భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన ఆహారాన్ని శుద్ధ నీటిని మాత్రమే తీసుకోవాలని వివరించారు. పండ్లను మరియు కూరగాయలను పరిశుభ్రమైన నీటితో శుభ్రం చేసుకోవాలని బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను సామాజిక బాధ్యతగా గుర్తించాలని దీనివల్ల ఆనందమయమైన జీవితం గడపవచ్చని వివరించారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి ఆశా వర్కర్లు పార్వతీ షమీశీ విజయ లీల జయమ్మ పాట చాలా ప్రధానోపాధ్యాయులు మైనోద్దీన్ ఉపాధ్యాయులు పూర్ణ చంద్రకళ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి లెక్చరర్ నరసింహ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# లక్ష్య సాధనకు క్రమశిక్షణ సమయపాలన కీలకం

**నైపుణ్యాలను పెంపొందించేందుకే అన్నా అక్క కార్యక్రమం**
**ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి**

**నాగర్ కర్నూల్ జులై 9 (స్కైన్యూస్)** విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు క్రమశిక్షణ మరియు సమయపాలన ఎంతో కీలకమని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి వివరించారు గురువారం కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులలో సామాజిక బాధ్యత నాయకత్వ లక్షణాలు ప్రసంగ నైపుణ్యాలను పెంపొందించేందుకు



ఏర్పాటు చేసిన అన్న అక్క కార్యక్రమం మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల మరియు మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసిస్తూ ముందుకు సాగాలని కోరారు. విజయవాడలో కలిగే ప్రయోజనాలను వివరించారు భవిష్యత్తులో వచ్చే అవకాశాలను పోటీ పరీక్షలను వ్యక్తిత్వ వికాసాన్ని ఎలా అదగమించాలో వివరించాడు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుపై ఆసక్తిగా పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం జాతీయవాదం సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ శ్రీకాంత్ కు వినతిపత్రం



**దేవరకద్ర జులై 9 (స్కై న్యూస్);** దేవరకద్ర మున్సిపాలిటీ, మండల విధ్యుత్ అంతరాయం సమస్య తీవ్రంగా ఉన్నందున సమస్య దేవరకద్ర విధ్యుత్ అధికారి ఏ ఈ శ్రీకాంత్ కి గురువారం వినతిపత్రం అందజేసిన బి జె పి దేవరకద్ర మండల అధ్యక్షులు కృష్ణం రాజు తదితరులు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గం లో విద్యుత్ సమస్య చాలా తీవ్రంగా ఉందని దాన్ని తక్షణమే బాగు చేయాలని అన్నారు. విద్యుత్తు సమస్య సాల్వ్ చేయకుంటే చాలా విపత్తులు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు యజ్ఞం భూపాల్ రెడ్డి ,దేవన్న సాగర్, వెంకటేశ్వర్ రెడ్డి,కౌన్సిలర్గా. రాజు నాగి రెడ్డి,రాచాల రాజు, అప్పి అనిల్ కుమార్, శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమానికి సహకరించండి..

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్**



**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** ఫరూక్‌నగర్ మండల కేంద్రంలోని 236, 237 పోలింగ్ స్టేషన్ల పరిధిలో గురువారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ నిర్వహించి మొత్తం 1,496 మంది ఓటర్లకు ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమానికి ప్రతి ఓటరు సహకరించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ శ్రీలత, బీఎల్ఏ మహమ్మద్ అఫ్రోజ్, సర్వర్ పాషా, సయ్యద్ ఖాదిర్, జంగయ్య, మహమూద్ బాయ్, ఖజా తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులు వేగవంతం చేయాలి...

**జోగులాంబ గద్వాల, జూలై 9 (స్కై న్యూస్):** ప్రభుత్వం మొదటి దశలో జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో రీసర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రెవిన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), సంబంధిత అధికారులతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటిపై చేసిన ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఆలస్యం చేయకుండా నిర్వహించి, వెంటనే రీసర్వే పనులను ప్రారంభించాలని సూచించారు. గ్రామసభల నిర్వహణను వాయిదా వేయకుండా, ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ సర్వేయర్లతో పాటు రెగ్యులర్ సర్వేయర్లను కూడా రీసర్వేలో వినియోగించాలని, లైసెన్స్ సర్వేయర్లు చేసే పనిని మండల సర్వేయర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బందికి సర్వేపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ప్రతి శిక్షణార్థికి కనీసం ఒక గ్రామంలో ప్రాక్టికల్ సర్వే పూర్తి చేసిన తర్వాతే శిక్షణ పూర్తయినట్లు పరిగణిస్తామని వెల్లడించారు. నవంబర్ నాటికి తొలి దశలో లక్ష్యంగా పెట్టుకున్న గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, మిగిలిన గ్రామాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ,




సమన్వయంతో రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విసి అనంతరం మాట్లాడారు. రీసర్వేకు సంబంధించి త్వరలోనే లైసెన్స్ సర్వేయర్లతో సమన్వయ సమావేశం నిర్వహించి వారికి తగిన సూచనలు చేయాలన్నారు. రాజోలి, ఎర్రవల్లి మండల కేంద్రాల్లో తహసిల్దార్ కార్యాలయాలతో పాటు గద్వాల, అలంపూర్ లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. భూభారతి, సాదా బైనమా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడి నూకరాజు పాల్గొన్నారు.

# సిద్ధంశెట్టి దత్తును పరామర్శించిన కంతారెడ్డి తిరుపతి రెడ్డి

**పాపన్నపేట ,జూలై09 (వార్తతరంగాలు)** :మెదక్ జిల్లా,పాపన్నపేట మండల పరిధిలోని పాత లింగాయిపల్లి గ్రామానికి చెందిన చీకోడ్ పీఏసీఎస్ చైర్మన్,బీఆర్ఎస్ నాయకులు సిద్ధంశెట్టి దత్తు తండ్రి సిద్ధంశెట్టి సంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా



నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి గురువారం పాత లింగాయిపల్లి గ్రామానికి వెళ్లి దత్తుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈసందర్భంగా సంగయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని తెలిపారు.సంగయ్య మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్,పాపన్నపేట మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చంద్రమోహన్ గౌడ్, కల్వకుంట సర్పంచ్ అందే కొండల్ రెడ్డి,గ్రామ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హాకా రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి సకాలంలో అందించడమే రైతు సేవా కేంద్రాల లక్ష్యమని తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులకు దూరంగా ఉండి రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, సయ్యాద్ సాదిక్ మల్లేష్ గౌడ్, రాములు గౌడ్ కేకే కృష్ణ, సర్పంచులు అంజి, ఫహీం, జంగీర్, వీరేందర్ రెడ్డి జీబీ కృష్ణ, బోరేగ నరేందర్, బొట్టు శ్రీను, గుట్ట రాజు,





నర్సింహా రెడ్డి, రవీందర్ రెడ్డి, గాలి శ్రీను, నాగులపల్లి శివకుమార్, మామిడిపల్లి రవి, ద్వేజేందర్, కోయల నర్సింలు, ఫిల్వన్, కటిక రఘు జమల్పూర్ నరేందర్, శ్రీనాథ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, రమేష్,పామేనా కుమార్, శివకుమార్, వేమా రెడ్డి,కాంట్రాక్టర్ సిద్ధార్థ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీనాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణను ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలి..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని స్వయంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి అవగాహన




కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణను ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, జితేందర్ రెడ్డి, సయ్యద్ సాదిక్, మల్లేష్ గౌడ్, కేకే కృష్ణ, సర్పంచులు అంజి, ఫయం, జంగీర్, వీరేందర్ రెడ్డి, బొట్టు శ్రీను, గుట్ట రాజు, నర్సింహారెడ్డి, రవీందర్ రెడ్డి, గాలి శ్రీను, నాగులపల్లి శివకుమార్, మామిడిపల్లి రవి, ద్విజేందర్, కోయల నర్సింలు, ఫెల్వాన్, కటిక రఘు, శ్రీనాథ్ రెడ్డి, రమేష్, పామేనా కుమార్, శివకుమార్, వేమారెడ్డి, బీఎల్ఏలు అంజన్న, యువరాజు, బీఎల్ఓలు, జీపీఓ నరేష్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
శుక్రవారం 10 జూలై 2026

## నూతన శ్రీ పోచమ్మ గుడిలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ పూజలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**చిన్న చింతకుంట జులై 9 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోని పర్దిపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ గుడిలో గురువారం విగ్రహం ప్రతిష్టాపన మహోత్సవ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి మధుసూదన్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవరకద్ర నియోజకవర్గ మండలాలోనీ గ్రామాలలో పశు సంపదను కాపాడాలని, పాడిపంటలు పండాలని, పిల్ల పాపాలను ప్రజలను, ఆయురారోగ్యాలతో ధనదానాలతో సంతోషంగా జీవించాలని కోరినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేని గ్రామ సర్పంచ్ ఆలయ నిర్వాకం గ్రామ పెద్దలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు పోచమ్మ తల్లి గుడి నిర్మాత జయరాజ్ మేస్త్రీలను శాల్వాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బురానప్ప కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు తెలుగు వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్, రాజు, బాలరాజు, శ్రీధర్ రెడ్డి విజ్జుబాబు, మల్లప్ప, శివ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేవెళ్లలో జెండా ఆవిష్కరణ



**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా చేవెళ్ల నగర శాఖ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ విద్యార్థి హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య, జాతీయ భావన, సమాజ సేవ లక్ష్యాలతో ఏబీవీపీ నిరంతరం పనిచేస్తోందన్నారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి హారికతో పాటు ఏబీవీపీ కార్యకర్తలు, పూర్వ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతో రాణించాలి

**విద్యార్థికి సూచించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**కులాంతర వివాహం చేసుకున్న జంటకు ప్రోత్సాహకం**



అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, విద్యార్థులకు సైతం సహకారం అందిస్తున్నందున ఉన్నత చదువులు అభ్యసించి రాణించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇటిక్యాల మండలం వావిలాల గ్రామానికి చెందిన విద్యార్థి లెవిన్ కుమార్ కు గురువారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత చదువులకు సహాయంగా ల్యాప్టాప్ ను అందజేశారు. అలాగే ఐజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన రమేష్ సురేఖ దంపతులు కులాంతర వివాహం చేసుకోవడంతో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహకంగా రూ.2.50 లక్షల విలువైన ఎఫ్ డి(ఫిక్స్డ్ డిపాజిట్) పత్రాన్ని కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, ఏఎస్సిడబ్ల్యూఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులకు జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏబీవీపీ "జ్ఞానం--శీలం--ఏకత" అనే సిద్ధాంతాలతో విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందిస్తూ జాతీయ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఏబీవీపీ చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. తెలంగాణలో కూడా విద్యార్థుల్లో జాతీయ భావజాలాన్ని బలోపేతం చేయడంలో ఏబీవీపీ విశేష కృషి చేస్తోందని ఆయన తెలిపారు.

## ప్రమాదంలో గాయపడిన మాజీ కౌన్సిలర్ నందకిషోర్ తల్లిని పరామర్శించిన రవీందర్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** ఇటీవల ప్రమాదంలో గాయపడి షాద్‌నగర్‌లోని లోటస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ కౌన్సిలర్ నందకిషోర్ తల్లిని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆమె త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, శారద శేఖర్, గోపాల్, సర్పంచ్ గీత వీరేశం, మాజీ కౌన్సిలర్లు జూపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే నా అభిమతం..

**కొందుర్గును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం..**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** కొందుర్గు మండలంలోని రేగడి చిల్కమర్రి--రామచంద్రపురం గ్రామాల మధ్య రూ.5.60 కోట్లతో నిర్మాణంలో ఉన్న హై లెవల్ బ్రిడ్జి, కల్వర్టుల పనులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులు, వంతెనలు, మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. కొందుర్గు మండలంలో వంతెనలు, సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, ఏకీకృత పాఠశాల, మినీ స్పోర్ట్స్ స్టేడియం వంటి అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, సయ్యాద్ సాదిక్ మల్లేష్ గౌడ్, రాములు గౌడ్, కేకే కృష్ణ, సర్పంచులు అంజి, ఫయం, జంగీర్, వీరేందర్ రెడ్డి జీబీ కృష్ణ, బోరేగ నరేందర్, బొట్టు శ్రీను, గుట్ట రాజు, నర్సింహా రెడ్డి, రవీందర్ రెడ్డి, గాలి శ్రీను, నాగులపల్లి శివకుమార్, మామిడిపల్లి రవి, ద్వేజేందర్, కోయల నర్సింలు, ఫిల్వన్, కటిక రఘు, జమల్పూర్ నరేందర్, శ్రీనాథ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, రమేష్, పామేనా కుమార్, శివకుమార్, వేమా రెడ్డి, కాంట్రాక్టర్ సిద్ధార్థ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీనాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి..

**ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి**

**పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలి..**

**బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య**



**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** జిల్లడ చౌదరిగూడ మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పనుల వారీగా వేతనాలు నిర్ణయించాలని, పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సంక్షేమ సౌకర్యాలు వెంటనే కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం చౌదరిగూడ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో హనుమంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య మండల అధ్యక్షులు జి రమేష్ మండల కార్యదర్శి ఫకీర్ అన్వర్ ఉపాధ్యక్షులు పాపయ్య ఇదమ్మ సహయ కార్యదర్శి లక్ష్మయ్య ఆర్ జంగయ్య సమితి సభ్యులు మల్లేష్ బాలమ్మ నర్సమ్మ సరళ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 13న ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ

**నులిపురుగులను నిర్మూలిద్దాం... పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదాం...**



**జోగులాంబ గద్వాల, జూలై 9 (స్కై న్యూస్):** డీఎంహెచ్వో సంధ్య కిరణ్మై నేతృత్వంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అస్గర్ అలీ మరియు ప్రోగ్రాం అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల అర్హులైన 1,71354 మంది పిల్లలందరికీ ఈనెల 13వ తేదీ సోమవారం రోజున సామూహిక ఉచిత మాత్రల పంపిణీ, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలు అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రాలను పంపిణీ చేయడం జరుగుతుంది. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 13వ తేది సోమవారం రోజున పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుంది ఆరోజు వేసుకోలేని పిల్లలకు ఈనెల 20వ తేదీ సోమవారం రోజున నిర్వహించే(వీఖణ) మాప్ అప్ డే రోజున వేయడం జరుగుతుంది ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సగం టాబ్లెట్ రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఒక టాబ్లెట్ వేస్తారు ఈ మాత్రల వలన ఎటువంటి హానికరమైన దుష్ప్రభావాలు ఉండవని తల్లిదండ్రులు ఎలాంటి అపోహాలకు గురికాకుండ తమ పిల్లలకు తప్పనిసరిగ మాత్రలు వేయించాలని కోరడం జరిగింది విద్యాశాఖ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ పంచాయత్ రాజ్ మున్సిపల్ మరియు ఇతర అనుబంధాల శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి మాత్రలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**నులిపురుగులు ఏ విధంగ సంక్రమిస్తాయి:-**

నులిపురుగులు సోకిన పిల్లలు బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేయడం వలన అట్టి ప్రాంతంలో పాదరక్షలు ధరించకుండ తిరగడం వలన ఆరోగ్యకరమైన పిల్లలకు సంక్రమించడం జరుగుతుంది. నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత పోషకాహార లోపం ఆకలి మందగించడం కడుపునొప్పి బలహీనత చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు.

నులిపురుగుల నివారణకు చేతులను సబ్బుతో శుభ్రంగ కడుక్కోవడం గోర్లు కత్తిరించుకోవడం పరిశుభ్రమైన నీరును త్రాగడం పాదరక్షలు ధరించడం బహిరంగ మలవిసర్జనకు బదులుగ మరుగుదొడ్లను వినియోగించడం వంటి పరిశుభ్రత చర్యలు పాటించడం వలన నులిపురుగులను నివారించవచ్చును.

## పీఆర్సీ నీ వెంటనే ప్రకటించాలి

**పి ఆర్ టి యు డిమాండ్**



**నారాయణపేట జూలై 9: (స్కైన్యూస్):** ప్రభుత్వము వెంటనే టి ఆర్ సి ని ప్రకటించాలనీ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు .గురువారం పిఆర్టియుటిఎస్ ఉట్కూర్ మండల శాఖ అధ్యక్షులు గోవర్ధన్ ప్రధాన కార్యదర్శి కే నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉట్కూరు మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి 2026 2027 విద్యాసంస్థలకు సంబంధించిన సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి గారు ఉపాధ్యాయులు ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వము ఆర్థిక ప్రయోజనాలు కలిగించకుండా ఎన్ని మాటలు చెప్పినా వారి కుటుంబ అవసరాలు తీరవు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్సిని 51 శాతం ఫిట్మెంట్తో మిగిలిన పెండింగ్ డీఏలను పిఆర్సి తో పాటు ప్రకటించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ఉపాధ్యాయులు ఆరోగ్య కారులపై సందేహాలను వ్యక్తం చేయగా ట్రస్టు ద్వారా నాణ్యమైన వైద్య సదుపాయము అందుతుందని కావున ఉపాధ్యాయులు ఎవరు హెల్త్ కార్డులపై అపోహలు చెందవలసిన అవసరం లేదని వివరణ ఇచ్చారు తెలంగాణ ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమును రద్దు చేస్తామని చెప్పి కాలయాపన చేయడం తగదని అన్నారు ప్రభుత్వము వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమ బాట పట్టడానికి సంసిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులను కోరారు ఏది ఏమైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పిఆర్టి తోనే సాధ్యమని ఉపాధ్యాయులకు తెలుసు అని అన్నారు అందువలన ఉపాధ్యాయులు సంఘ భలోపేతం కోసము సంఘంలో స్వచ్ఛందంగా సభ్యత్వము చేయాలని కోరగా ఉపాధ్యాయులు అధిక మొత్తంలో సంఘంలో సభ్యత్వం స్వీకరించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిని మాధవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ప్రధాన ఉపాధ్యాయురాలు కుసుమ గారు మండల గౌరవ అధ్యక్షులు ఫజల్ జిల్లా బాధ్యులు భాస్కర్ ఆనంద్ సాయప్ప మహేష్ రాములు అబ్దుల్ సలాం ఆంజనేయులు గుర్నాథ్ పద్మావతి ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

## పలు శుభకార్యాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు వివాహాది శుభకార్యాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాత్మక ప్రతిభను వెలికి తీయడం సామాజిక బాధ్యత..




**నాగర్ కర్నూల్ జులై 9 (స్కై న్యూస్)** విద్యార్థులలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీయడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని క్లాస్మెంట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ నగిశెట్టి కోదండరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ అన్నారు గురువారం ప్రముఖ దర్శకుడు బాలచందర్ జయంతిని పురస్కరించుకొని క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పాటల పోటీలను క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాస రాఘవేందర్ సూచన మేరకు నిర్వహించారు ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకను గుర్తించేందుకు క్లబ్ ఆధ్వర్యంలో అనేక పోటీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు అనేక సందర్భాలలో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో క్లబ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీ ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుళ్ల పల్లి రమణకుమార్ మహిళా ప్రతినిధి వనిత ఉపన్యాసములు అంజయ్య రామకృష్ణ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు

# సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ మెగా సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

## రూ.3,342 కోట్ల పెట్టుబడి.. 2,500 మందికి ఉపాధి..

## తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం







**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** తెలంగాణను హరిత ఇంధన రంగంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్ పారిశ్రామిక ప్రాంతంలో రూ.3,342 కోట్ల పెట్టుబడితో 75 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్రీమియర్ ఎనర్జీస్ అత్యాధునిక మెగా సోలార్ మాడ్యూల్ తయారీ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో ఇది ఒక కీలక మైలురాయని అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ద్వారా సుమారు 2,500 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని, స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సంస్థ యాజమాన్యాన్ని కోరారు. భవిష్యత్తు గ్రీన్ ఎనర్జీదేనని, పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో విధానంలో వేగవంతమైన అనుమతులు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మరిన్ని హరిత పరిశ్రమలు ఏర్పాటు కావడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ సీతారాంపూర్ ప్లాంట్‌లో అత్యాధునిక +12= య్రాజశీఅ టెక్నాలజీతో జీరో బస్‌బార్ (0దీదీ) సోలార్ మాడ్యూళ్లను తయారు చేయనుంది. పూర్తిగా రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) ఆధారిత ఫాల్ట్ డిటెక్షన్ వ్యవస్థతో ప్రతి 16 సెకన్లకు నాలుగు హై-ఎఫిషియెన్సీ సోలార్ మాడ్యూళ్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ ప్లాంట్‌కు ఉంది. అదనంగా 5.6 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో కంపెనీ మొత్తం సామర్థ్యం 11.1 గిగావాట్లకు చేరి దేశంలోని ప్రముఖ సోలార్ తయారీ సంస్థల్లో ఒకటిగా నిలవనుంది. ప్లాంట్ ప్రాంగణంలోనే 5,10,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక గిడ్డంగి (వేర్‌హౌస్)ను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రీమియర్ ఎనర్జీస్ మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సాలూజా, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ ద్వారా ఓటు నమోదు చేసుకోవాలి

**: వెంకట్రాములు గౌడ్**



**నారాయణపేట జూలై 9: (స్కైన్యూస్)** ఎస్ ఐ ఆర్ ద్వారా ఓటర్ జాబితాలో ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసుకోవాలని నారాయణపేట మండలం కోటకొండ గ్రామ సర్పంచ్ వెంకట రాములు గౌడ్ , ఎనిమిదవ వార్డు మెంబర్ ఏ లక్ష్మి రాములు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు, ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఏడు, ఎనిమిది, తొమ్మిది వార్డులకు సంబంధించిన వివరాలను తెలిపే ఫారాలను సేకరించి పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. జి పి ఓ జ్యోతి గ్రామంలో సూపర్వైసింగ్ చేస్తూ ఈ వార్డులకు సంబంధించిన బి ఎల్ ఓ నర్సమ్మ ద్వారా సేకరించిన ఫారాలను సక్రమంగా పూర్తి చేస్తున్నారా లేద అని పరిశీలించారు. బి ఎల్ ఓ కు సహకారంగా జి పి ఓ తో పాటు విద్యార్థి ఏ అఖిల, ఎడ్ల అనూష ఫారాలను పూర్తి చేస్తూ సహకరిస్తున్నా వీరిని ప్రజలు అభినందిస్తున్నారు. తేదీ దగ్గర పడుతుంది కాబట్టి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి యొక్క వివరాలను 24 తారీకు లోపల పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు చేశారు.

# వనపర్తి జిల్లాలో ఆత్మకూరు మండలం భూవివాదం....రైతులపై దాడి



**ఆత్మకూరు జులై 9 (స్కై న్యూస్)** వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల గ్రామంలో భూ వివాదం ఉద్రుక్తకు దారి తీసింది సర్వే నెంబర్లు298,99,71,70పరిధిలోని భూమిపై రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది తమ తాతల కాలం నుంచి వస్తున్న సుమారు 80 ఎకరాల వారసత్వం భూమి ఇదేనని భూమి రికార్డులు కూడా తమ పేర్ల పైనే ఉన్నాయని బాధ్యత రైతులు చెబుతున్నారు ఇదే భూమికి సంబంధించిన ఆత్మకూర్ కు చెందినరఫీ తో పాటు సుమారు 40 మంది వచ్చి తమపై తమ తండ్రిపై దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు ఘటన స్థానానికి బాధ్యత రైతులు ఆత్మకూర్ సిఐ ను కలిసి ఫిర్యాదు చేశారు సమాచారం అందుకున్న సిఐ శివకుమార్ ఎస్ఐ స్వాతి ఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితి పరిశీలించారు ఇరువర్గ వాదనలు నమోదు చేసి భూ వివాదం మరియు దాడి ఆరోపణలపై అన్ని కోణాల విచారణ చేపట్టినట్లు సమాచారం ఈ ఘటనతో నందిమల్ల గ్రామంలో కొంత ఉధృప్త పరిస్థితి నెలకొంది సమయానికి అధికారులు వచ్చినందుకు సామరస్యంగా ఒకరికొకరు నచ్చజెప్పి ఒకరి మీద ఒకరు కేసులు పెట్టుకొని సమస్యను అన్ని రకాల కోణాల్లో కేసును దర్యాప్తు చేసి ఇంకా తెలియవాల్సిన విషయాలు ఉన్నాయని తెలిపారు

# ఎస్ ఐ ఆర్ ను పర్యవేక్షించిన బిజెపి నాయకులు



**నారాయణపేట జూలై 9: (స్కైన్యూస్)**నారాయణపేట వార్డుల్లో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పట్టణంలోని 19వ వార్డులో గురువార పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్ పర్యవేక్షించారు. సంబంధిత బిఎల్ఓ ల కు అన్ని బూత్ లలోని ఓటర్లు వారికి సహకరించి ఈనెల 24వ తేదీ వరకు తమకు ఇచ్చినటువంటి ఎన్యుమరేషన్ ఫామ్ లను పూరించి వారికి అప్పగించా లని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫామ్ లను ఓటర్లు తమ తమ ఇళ్లలో ఉంచుకోకుండా ఏవైనా సందేహాలు ఉంటే ఫామ్ పై ఉన్న బిఎల్ఓ ల ఫోన్ నంబర్ల ద్వారా వారిని సంప్రదించి లేదా వార్డులో ఉన్న భారతీయ జనతా పార్టీ బి ఎల్ ఎ 2 లను గాని అక్కడి నాయకులను గాని సంప్రదించి అట్టి పత్రాలు వీలైనంత త్వరగా అందించా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు నక్క సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి సంబంధిత బి ఏ ల్ ఏ 2 లు శ్రీకాంత్, వల్లంపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పునర్నిమాణమే ఎబివిపి ధ్యేయం

**ఆవిర్భావ సభలో వక్తలు**





**నారాయణపేట జూలై 9: (స్కైన్యూస్)** జాతీయ పునర్నిమాణమే ఏ బి వి పి ధ్యేయం అని వక్తలు పేర్కొన్నారు.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం వివిధ కళాశాలలో 78వ ఆవిర్భవ,జాతీయ విద్యార్థి దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నారాయణపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖ్య వక్తగా పూర్వ ఏబీపీ కార్యకర్త శెట్టి మహేష్, శ్రీ సాయి జూనియర్ కళాశాల ముఖ్య వక్త తపస్ జిల్లా అధ్యక్షులు నర్సింలు,ఎస్ వి ఎస్ జూనియర్ కళాశాల లో ముఖ్య అతిథి ప్రధానోపాధ్యాయురాలు శేషమ్మ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమంనిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ 1949 జూలై 9న స్థాపించబడిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, జాతీయ చైతన్యం, విద్యా సంస్కరణలు మరియు సమాజ సేవలో నిరంతరం కృషి చేస్తోందన్నారు.1975లో విధించిన ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఏ బి వి పి కార్యకర్తలు ధైర్యంగా పోరాడారని, వేలాది మంది విద్యార్థులు అరెస్టులు, నిర్బంధాలను ఎదుర్కొన్నప్పటికీ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు వెనుకడుగు వేయలేదని తెలిపారు.దేశ సమగ్రతకు సంబంధించిన కీలక అంశాల్లో కూడా ఏ బి వి పి నిరంతరం తన పాత్రను పోషించిందన్నారు. ఈశాన్య భారతదేశాన్ని దేశంలోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించే వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన చికెన్ నెక్ ప్రాంతం భద్రత, జాతీయ ఐక్యతపై అవగాహన కల్పించేందుకు ఏ బి వి పి చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. అలాగే జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు దేశ సమగ్రతను బలోపేతం చేసిన చారిత్రక నిర్ణయమని పేర్కొంటూ, ఆ అంశంపై విద్యార్థుల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు ఏ బి వి పి దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు.విద్యారంగంలో ఫీజుల నియంత్రణ, నాణ్యమైన విద్య, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలు, ఉపాధి అవకాశాల కల్పన వంటి సమస్యల పరిష్కారం కోసం ఏ బి వి పి నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. అలాగే రక్తదాన శిబిరాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవలందిస్తోందని వివరించారు.దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంతో పాటు జాతీయ భావన, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సతీష్, ఇంతియాజ్, చరణ్ రెడ్డి, ఓంకా, అభి, అజయ్, మణికంఠ, అక్షర, కార్యకర్తలు మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువతకు వరంగా మినీ స్టేడియం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా, జూలై 9 (స్కై న్యూస్):** కొందుర్గు మండల కేంద్రంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మినీ స్టేడియం స్థలాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. భూమి సర్వేను వెంటనే పూర్తి చేసి, నిర్మాణ పనులను ఆలస్యం లేకుండా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధితో యువతకు మెరుగైన శిక్షణ అవకాశాలు లభించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. మినీ స్టేడియం కొందుర్గు ప్రాంత యువతకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, సయ్యాద్ సాదిక్ మల్లేష్ గౌడ్, రాములు గౌడ్, కేకే కృష్ణ, సర్పంచులు అంజి, ఫయం, జంగిర్, వీరేందర్ రెడ్డి జీబీ కృష్ణ, బోరేగ నరేందర్, బొట్టు శ్రీను, గుట్ట రాజు, నర్సింహా రెడ్డి, రవీందర్ రెడ్డి, గాలి శ్రీను, నాగులపల్లి శివకుమార్, మామిడిపల్లి రవి, ద్వేజేందర్, కోయల నర్సింలు, ఫిల్వన్, కటిక రఘు, జమల్పూర్ నరేందర్, శ్రీనాథ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, రమేష్, పామేనా కుమార్, శివకుమార్, వేమా రెడ్డి, కాంట్రాక్టర్ సిద్ధార్థ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు,



కాంగ్రెస్ పార్టీనాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల స్థల వివాదానికి తాసిల్దార్,ఎంపీడీవో ఆధ్వర్యంలో సమస్యకు పరిష్కారం...





**దేవరకద్ర, కౌకుంట్ల జులై 9 (స్కై న్యూస్);** కౌకుంట్ల మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో గత 30 సంవత్సరాలుగా వివాదంలో ఉన్న స్థల సమస్యకు ఎటికేలకు పరిష్కారం లభించింది. తాసిల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఈ సమస్యను పరిష్కరించారు. తిరుమలాపూర్ గ్రామంలో రెండు కుటుంబాల మధ్య స్థల విషయంలో 1990వివాదము కొనసాగుతుంది. దీంతో గ్రామంలో గొడవలు పోలీస్ కేసులు కూడా నమోదయ్యాయి. ఈ సమస్యపై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తాజాగా కౌకుంట్ల మండల కార్యాలయంలో తాసిల్దార్, ఎంపీడీవో సంయుక్తంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సంబంధిత రెవెన్యూ అధికారులు పాత పత్రాలు పరిశీలించి ఇరువు వర్గాలతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో 30 ఏళ్లు సాగుతున్న వివాదానికి ముగింపు పలికారు. నిర్ణయంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన తాసిల్దార్ ఎంపీడీవోలను గ్రామ ప్రజలు అభినందించారు.

# ఆరోపణలు నిరూపించకపోతే పరువు నష్టం దావా

**అభివృద్ధి సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమే**

**గత ప్రభుత్వ హయాంలోనే భారీ అవినీతి**

**మాజీ జడ్పిటిసి అవినీతిని నిరూపిస్తాం**

**మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు**




**నాగర్ కర్నూల్ జులై 9 (స్కైన్యూస్)** తనపై మాజీ జడ్పిటిసి చేసిన అవినీతి ఆరోపణలు నిరూపించకపోతే పరువు నష్టం దావా కేసు వేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు హెచ్చరించారు గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు పార్టీ మండల అధ్యక్షుడు మాజీ ఎంపీపీ కోటయ్య యాదవ్ ఆర్టీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హబీబ్ లు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు రాజకీయ లబ్ధి కోసం బిఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో తిమ్మాజీపేట మండలం గోరింటా పిఏసిఎస్ లో భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. తనపై అసత్య ఆరోపణలు చేసిన మా మాజీ జడ్పిటిసి శ్రీశైలం మిషన్ భగీరథ పనులలో 59 లక్షల అవినీతికి పాల్పడ్డారని తన సొంత గ్రామమైన పెద్ద ముద్దునూరు గ్రామంలో 9 లక్షల అవినీతి చోటుచేసుకుందని అన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలుకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు మార్కెట్ కమిటీ చైర్మన్గా ఎంతో కృషి చేశానని ఎక్కడ అవినీతి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. రెండు సంవత్సరాలకు పైగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ ఇసుక వ్యాపారం రియల్ ఎస్టేట్ మాఫియా నల్లమట్టి మాఫియా ప్రజలను దోచుకుతున్నారని అన్నారు. పదవులు ఎప్పుడు శాశ్వతం కాదని మాజీ నాయకులు గుర్తుంచుకోవాలని పదవులు పోయిన వెంటనే ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజా పాలన అందిస్తూ ముందుకు సాగుతున్నామని మాజీ నేతలు 44 లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డానని ప్రకటించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని అన్నారు. తిన్నింటి విషయం గాని గ్రామంలో 470 మంది రైతులకు 18 వేల గన్నిబ్యాగులు ఇప్పించడం జరిగిందని అన్నారు ఈ సమావేశంలో బిజినేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు మిద్దె రాములు వైస్ చైర్మన్ జంగయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కొత్త శ్రీనివాసులు అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి పట్టణ అధ్యక్షులు జక్కా రాజ్ కుమార్ రెడ్డి నాయకులు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి...

## జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్




**నాగర్ కర్నూల్ జులై 9 (స్కైన్యూస్)** బాలలపై మరియు మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అన్నారు గురువారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు సురక్షిత బాల్యాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని లైంగిక వేధింపులకు పాల్పడితే కఠినంగా శిక్షలు విధించడం జరుగుతుందని వివరించారు. మహిళల రక్షణ కోసం షీ టీం నిరంతరం పనిచేస్తుందని బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచి వేధింపులకు పాల్పడే వాడిని శిక్షిస్తామని తెలిపారు. మహిళల రక్షణ కోసం భరోసా కేంద్రం బాలల హక్కుల సాధనకు అనేక విధాలుగా కృషి చేస్తున్నామని వివరించారు ఈ సందర్భంగా మిషన్ వాత్సల్య పథకం వివరించారు ఈ కార్యక్రమంలో డిఎస్పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ సీసీఎస్ సిఐ శంకర్ డిసిఆర్బి ఎస్సై రమేష్ భరోసా ఎస్సై రజిత తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పోరాటాలకు రాజకీయ శిక్షణ ఎంతో దోహదపడాలి

**కమ్యూనిస్టు పార్టీ ఆశయాల సాధనకు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి**

**ప్రజా పక్షాన నిలబడి పోరాడటమే నాయకుల, కార్యకర్తల ప్రధాన బాధ్యత**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు**






**భద్రాచలం జూలై 9( స్కై న్యూస్)** : ప్రజా పోరాటాలకు మూడు రోజులపాటు జరిగిన రాజకీయ శిక్షణ దోహదపడాలని, ప్రజలను చైతన్యపరిచి పోరాటాల వైపు నడిపించే చైతన్య తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సమావేశం గురువారం భద్రాచలంలోని రెడ్డి సత్రంలో జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు అనంతరం ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు సాగిన శిక్షణా తరగతులపై సమగ్రంగా సమీక్ష జరిపారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాల ఉధృతిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ సమకాలీన సామాజిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆశయాల సాధనకు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని, ప్రజా పక్షాన నిలబడి పోరాడటమే నాయకుల, కార్యకర్తల ప్రధాన బాధ్యతని అన్నారు. చలో ఢిల్లీ, జిల్లా వ్యాప్త పాదయాత్రలు, అంగన్వాడీ యూనియన్ పాదయాత్ర, గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని, అందుకోసం ప్రతి కార్యకర్త తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు. నరాటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం కల్లూరు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ పుల్లారెడ్డి, ఎస్ డి సలీం, వెంకటేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, వి పూర్ణచంద్రరావు, చంద్ర నరేంద్ర కుమార్, కంచర్ల జమలయ్య, ముప్వ వెంకటేశ్వరరావు, రేసు ఎల్లయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్ కే ఫహీమ్, దేవరకొండ శంకర్ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

# 78వ జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో మహా ర్యాలీ




**జోగులాంబ గద్వాల, జూలై 9(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గద్వాల శాఖ ఆధ్వర్యంలో 78వ జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఘనంగా మహా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొని పట్టణ ప్రధాన వీధుల గుండా జాతీయ జెండాలు, ఏబీవీపీ జెండాలు చేతబట్టి దేశభక్తి నినాదాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఏబీవీపీ జెండాను ఆవిష్కరించి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అఖిల భారత విద్యార్థి పరిషత్ గత 77 సంవత్సరాలుగా దేశ నిర్మాణంలో విద్యార్థి శక్తిని సమీకరిస్తూ సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, జాతీయ సమైక్యత, వ్యక్తిత్వ వికాసం వంటి రంగాల్లో విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించడం ఏబీవీపీ ప్రధాన లక్ష్యమని, దేశ అభివృద్ధికి యువత ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, జాతీయ విలువలను పరిరక్షిస్తూ సమాజ సేవలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా, పట్టణ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, విద్యార్థినులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలి





**జోగులాంబ గద్వాల, జూలై 9 (స్కై న్యూస్):** ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాశ్వత అభివృద్ధికి దోహదపడే విధంగా మూడేళ్ల కార్యాచరణ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి అనేది కేవలం నిర్మాణ పనులకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సమగ్ర ప్రక్రియ అని అన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ రహదారులు, వీధి దీపాలు, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి, మహిళా సాధికారత, యువత అభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల సూచనలు, స్థానిక అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీరాంజీ పథకం, 16వ ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛ భారత్ మిషన్, జల్ సిరి, తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను సమన్వయం చేస్తూ గ్రామ అవసరాలకు అనుగుణంగా నిధులను సమీకరించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, ప్రతి రైతు పొలంలో నీటి కుంటలు, చెక్‌డ్యాంలు, రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి వద్ద చెత్తను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలుగా వేరు చేసే అలవాటు పెంపొందించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబన కోసం ఇంటి పన్ను వసూళ్లను మెరుగుపరచడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, పంచాయతీ ఆస్తుల సమర్థ వినియోగం, పౌర సేవలను విస్తరించడం ద్వారా స్వంత ఆదాయ వనరులను పెంచాలని సూచించారు. ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గ్రామాభివృద్ధిని బాధ్యతగా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఆదర్శ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొారు

# గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు



**కొత్తగూడెం జూలై 9 (స్కై న్యూస్ ):** ప్రజల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, ముఖ్యంగా యువత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా రక్షించడం లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీ ప్రాంతంలో కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు బుధవారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చట్టపరమైన ప్రక్రియలు చేపట్టారు. ఈ ఘటనపై క్రైమ్ నెం.ఇఇఇ/2026 కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ వెలువరించరు. గంజాయి వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికి, కుటుంబానికి మరియు సమాజానికి తీవ్ర హానికరమని వారికి అవగాహన కల్పించి, భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచి డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించనున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డిఎస్పి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, గంజాయి కొనుగోలు, విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠ తిరుపతిరెడ్డి..

## రూ.5 వేల ఆర్థిక సాయం



**పాపన్నపేట. జులై09 (వార్తతరంగాలు)** :ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుర్తివాడ గ్రామానికి చెందిన సంజులు భార్య జయమ్మ కుటుంబ సభ్యులను గురువారం కంఠరెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జయమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఆయన, రోడ్డు ప్రమాదంలో జయమ్మ మృతి చెందడం ఎంతో బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, మాజీ గ్రామ అధ్యక్షుడు సిద్ధిరామిరెడ్డి, మాజీ ఏడుపాయల దేవస్థానం డైరెక్టర్ మోహన్‌రావు, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, కల్వకుంట సర్పంచ్ అందె కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, విల్సన్, చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫరూక్‌నగర్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన సదస్సు




**రంగారెడ్డి జిల్లా జూలై 9 (స్కై న్యూస్): రంగారెడ్డి జిల్లా** షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫరూక్‌నగర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వి. విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు నులిపురుగులు కలుషిత ఆహారం, నీరు, పరిశుభ్రత లోపం, చెప్పులు లేకుండా నడవడం వంటి కారణాల వల్ల శరీరంలోకి ప్రవేశిస్తాయని వివరించారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల కడుపునొప్పి, రక్తహీనత, బరువు తగ్గడం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు వస్తాయని, వాటి నివారణకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులందరికీ జూలై 13న ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని, ఆ రోజు మిస్ అయిన వారికి జూలై 20న నిర్వహించే మాప్-అప్ డేలో మాత్రలు వేయాలని తెలిపారు. ఎంఈఓ మనోహర్, ఎంపీడీవో శ్రీకాంత్ మాట్లాడుతూ వైద్య, విద్య, ఐసీడీఎస్ శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియా లో 11 వ రోజుకు చేరిన ఎగ్జిక్యూటివు రిలే నిరాహార దీక్షలు




**సింగరేణి జూలై 9 (స్కై న్యూస్ ):** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఆఫీస్ వద్ద కొత్తగూడెం ఏరియా కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పి ఆర్ పి వెంటనే చెల్లించాలని, పే ఉపగ్రడేషన్ వెంటనే చేయాలని, 11 వ రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా అధికారులందరూ హాజరై సీఎం ఓ ఏ ఐ వర్ధిల్లాలని , సింగరేణి యాజమాన్యం పి ఆర్ పి వెంటనే చెల్లించాలని , పే ఉప్గ్రదేషన్ చేయాలి అని నల్ల బ్యాడ్జీలు ధరించి ప్ల కార్డులు చేతబట్టి నినాదాలు చేశారు.

వార్తాతరంగాలు


# హరీష్ రావుకు దొర అహంకారం, నిలువెల్ల విషం

## హరీష్ రావు పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం హాట్ కామెంట్స్




**హైద్రాబాద్ జులై 9 ;**హరీష్ రావుకు దొర అహంకారం, నిలువెల్ల విషయం ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం హాట్ కామెంట్స్ చేశారు.గురువారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లోమాట్లాడుతూ 2018 లో ముఖ్యమంత్రిని చేయాలని ఢిల్లీకి పోయి హరీష్ రావు అమిత్ షా కలిసిండు ఎన్నికల్లో కాలేశ్వరం లో సంపాదించిన వేల కోట్ల రూపాయలు 40 ,50 మంది పోటీ చేసే ఎమ్మెల్యేలకు డబ్బులు ఇచ్చిండు కేంద్ర హోం మంత్రి అమీషాతో హరీష్ రావు టచ్ లో ఉండు హరీష్ రావు 2004 కుముందు నీ చరిత్ర ఏంటి? అని ప్రశ్నించారు.కెసిఆర్ కు పెద్ద పాలేరు నువ్వు 2004 కు ముందు స్లిప్పర్లు వేసుకొని కేసిఆర్ కు ఛాయలు అందించి,ఆయన బట్టలు ఇస్త్రీ చేసిన చరిత్ర హరీష్ రావు దిహరీష్ రావు 2004 లో వార్డు మెంబర్ కూడా కాదు రాజకీయ ఓనమాలు కూడా తెలియదు హరీష్ రావు ఎంత? హరీష్ రావు బ్రతుకు ఎంత?మా ముఖ్యమంత్రితో పోల్చుకునే అర్హత హరీష్ కు లేదన్నారు. ముఖ్యమంత్రి చరిత్ర ఎక్కడ నీ హరీష్ రావు బతుకు ఎక్కడ? మీ మామ నువ్వు వెన్నుపోటు నువ్వు పొడడవాలని చూసావు ఆ ముఖ్యమంత్రి వ్యవసాయం చేసుకుంటూ జడ్పిటిసి గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా ముఖ్యమంత్రిగా, సొంతంగా ఎదిగిండు ఏ సెంటిమెంట్ ని అడ్డు పెట్టుకోకుండా మా ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజలను ఒప్పించిండుకాంగ్రెస్ పార్టీ మీ మామకు నీకు రాజకీయ బిక్ష పెట్టింది, హరీష్ రావు గుర్తు పెట్టుకో అని హితవు పలికారు.నీ కాళ్ళ మీద ఎదిగినట్లు ఎందుకు యాక్షన్ చేస్తావు హరీష్ రావు నీకు మంత్రి పదవి ఇచ్చింది మా కాంగ్రెస్ పార్టీ కాదా? మామ అల్లుళ్లు కలిసి ప్రజల సొమ్ము దోచుకున్నారు కాలేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథలో హరీష్ రావు వేల కోట్లు దోచుకుండు అని కేసీఆర్ 2018 లో మంత్రి పదవి ఇవ్వలేదు సొంత మామ నమ్మకుండా సంవత్సరం పాటు నిన్ను కాళీ పెట్టిండు కాలేశ్వరం ప్రాజెక్టు పై హరీష్ రావు మాట్లాడితే తెలంగాణ ప్రజలు నమ్మరు.కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావు దొరలు ఎన్ని మాట్లాడినా తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితునికి వెస్సో సాయం



**హైద్రాబాద్ జులై 9 ;**నారయపల్లి గ్రామం, హెచ్.ఎం.పాడు మండలం, మార్కాపురం జిల్లా నివాసి షోడా శివ బ్రహ్మచారి(42) రోజువారీ వేతనంతో వడ్రంగి వృత్తి పై ఆధారపడి తన కుటుంబాన్ని పోషించేవారు. కొద్ది రోజుల క్రితం బ్రహ్మంగారి మఠానికి ద్విచక్ర వాహనంపై వెళు ండగా జరిగిన ఘోరమైన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, వైద్యుల సూచన మేరకు ఆయన కుడి కాలును మోకాలి దిగువ భాగం వరకు తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన శాశ్వత శారీరక వైకల్యానికి గురై, తన వృత్తిని కోల్పోయే పరిస్థితి వచ్చింది! కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితుల సహాయం తో వైద్య చికిత్స కోసం ఖర్చు చేసారు. తదుపరి చికిత్స, మందులు, పునరావాసం మరియు కృత్రిమ కాలు అమర్చుకోవడానికి ఆర్థిక సహాయం అవసరమైంది. తన దయనీయ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వెస్సో ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందించ వలసినదిగా శివ బ్రహ్మచారి వినమ్రంగా అభ్యర్థించారు. స్పందించిన వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో శివ బ్రహ్మచారికి 56,300 అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ వీరబ్రహ్మం కోలుకుని, తిరిగి మరో వృత్తి / వ్యాపారం చేపట్టి, తన కుటుంబానికి అండగా నిలబడేందుకు సహాయపడిన గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# రామవరం అర్బన్ హెల్త్ సెంటర్‌లో రాష్ట్రస్థాయి అధికారుల ఆకస్మిక తనిఖీ!



**కొత్త గూడెం జులై 9 ( స్కై న్యూస్):**భద్రాద్రి కొత్తగూడెం:రామవరంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల బృందం గురువారం నాడు సందర్శించింది. కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతుల నాణ్యతను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది.రికార్డుల క్షుణ్ణ పరిశీలన.. సేవలపై ఆరా హైదరాబాద్‌లోని రీజినల్ ఆఫీస్ ఫర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ వరుణ్ విజయ్ గైకి ఈ తనిఖీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రికార్డులను నిశితంగా పరిశీలించారు.ప్రతి వారం గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, వారికి జరుగుతున్న ఉచిత పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఏఎంసి రిజిస్ట్రేషన్లు,ఈడీడీ రిజిస్టర్లను చెక్ చేసి, ఇప్పటివరకు జరిగిన ప్రసవాల గణాంకాలను అంచనా వేశారు.టీబీ (క్షయ), లెప్రసీ (కుష్టు) వ్యాధిగ్రస్తుల వివరాలను, వారికి అందిస్తున్న ఉచిత మందుల పంపిణీ తీరును సమీక్షించారు.రోగులకు రక్తపోటు (బి.పి) పరీక్షించే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాల సురక్షిత డిస్పోజల్ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు.నాణ్యమైన వైద్యమే లక్ష్యం ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేద ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ వరుణ్ విజయ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు.ఈ ఉన్నతాధికారుల బృందంలో క్వాలిటీ మేనేజర్ శృతి, హెల్త్ ఎడ్యుకేటర్ రాంప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ సలిత ఉన్నారు. అలాగే ఈ తనిఖీ కార్యక్రమంలో రామవరం హెల్త్ సెంటర్ నర్సింగ్ ఆఫీసర్ శంకరమ్మ, పీహెచ్ఎం శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ స్పందన, డీఈఓ స్ఫూర్తి, ఏఎన్ఎంలు రాజేశ్వరి, శ్రీలక్ష్మి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 25 వేయిల ఎల్ ఓ సి ని అందజేసిన ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

**ఒకే వ్యక్తికి రెండు సార్లు ఎల్ ఓ సి రావడం చాల అరుదు**

**ఎమ్మెల్యే జిఎంఆర్కు కృతజ్ఞతలు చెప్పిన తల్లిదండ్రులు**



**చిన్న చింతకుంట జూలై 9 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల కేంద్రానికి చెందిన చింతకాయల వెంకటేష్ కుమారుడు శివసాయి చికిత్స నిమిత్తం గురువారం రెండవసారి 250000 వేల రూపాయల ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే జి. మధుసుధన్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ దేవరకద్ర నియోజకవర్గ మాజీ యూత్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ వార్డు సభ్యులు ఎస్.శేఖర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొర్ల వెంకటేశ్ ఎండి.జాకీర్,జి.పిలోగు,జి.ప్రతాప్ ఎస్ ఆర్.శాంసన్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్ నూతన కమిటీకి డీఎస్పీ అభినందనలు

## - పత్రికా రంగం ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం.. బాధ్యతాయుత జర్నలిజంతో ప్రజలకు సేవ చేయాలి:డీఎస్పీ శ్రీనివాస్ లు



**వేములవాడ జూలై 09(వార్తా తరంగాలు):** టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం గురువారం రోజున రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్ లు టౌన్ సీఐ వీరప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు,ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐలను శాలువాలతో సత్కరించి, శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు.అనంతరం డీఎస్పీ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని డీఎస్పీ శ్రీనివాస్ లు, టౌన్ సీఐ వీరప్రసాద్ శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ లు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా కీలక బాధ్యతను నిర్వర్తిస్తోందన్నారు. ప్రజలకు వాస్తవాలను నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పోలీసు శాఖ--మీడియా పరస్పర సహకారం ఎంతో అవసరమని అన్నారు.వాస్తవాల ఆధారంగా వార్తలను ప్రచురించడం ద్వారా ప్రజల్లో మీడియాపై విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు పాత్రికేయుల సంక్షేమం కోసం కూడా నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షిస్తూ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రేగుల రాంప్రసాద్, జిల్లా క్రమశిక్షణ కమిటీ మెంబర్ సయ్యద్ రసూల్, ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జితేందర్ రావు, ఉపాధ్యక్షులు సిహెచ్ దేవరాజ్, విష్ణు, కోశాధికారి పంపరి నాగరాజు, ఫాహద్, జింక శ్రీధర్,కమటాల విజయ్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్, షబ్బీర్ గంగాధర్, పండుగ స్వామి, నవీన్, ఆసీమ్,లక్ష్మీనారాయణ,రాములు పాల్గొన్నారు.

# ముగిసిన గడువు..




**వాట్సాప్‌నకు మరో ఛాన్స్ లేదు: కేంద్ర ప్రభుత్వం**

**ఢిల్లీ, జులై 9 :** వాట్సాప్ 'యూజర్‌నేమ్' నోటీసుల గడువు ఈరోజు(గురువారం)తో ముగిసిందని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. గడువు పొడిగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నోటీసులపై వాట్సాప్ (మెటా) యాజమాన్యం నేడు సమాధానం ఇవ్వనుంది. కేంద్రం అనుమతి ఇచ్చే వరకు భారత్‌లో 'యూజర్‌నేమ్' ఫీచర్‌ను తీసుకురాబోమని వాట్సాప్ స్పష్టం చేసింది. వాట్సాప్‌తో పాటు టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు పంపించింది. వాట్సాప్‌లో ఫోన్ నంబర్ లేకుండా చాట్ చేసుకునే 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్రప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కొత్త ఫీచర్ వల్ల దేశంలో సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు విపరీతంగా పెరిగే ముప్పు ఉందని ఐటీ శాఖ హెచ్చరించింది. వినియోగదారుల ఫోన్ నంబర్లు దాచిపెడితే నేరస్థులను ట్రాక్ చేయడం కష్టమవుతుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వానికి పూర్తి సంతృప్తి కలిగే వరకు ఈ ఫీచర్‌ను లాంచ్ చేయొద్దని మెటా సంస్థకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే యూజర్‌నేమ్ ఫీచర్ వాడుతున్న టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకూ నోటీసులు జారీ చేసింది. టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌ల వివరణ కోసం మరికొంత సమయం కేటాయించినట్లు ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు. సైబర్ మోసాల అదుపునకు తాము మల్టీ-లేయర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వాట్సాప్ ప్రతినిధి తెలిపారు. ప్రముఖులు, ప్రభుత్వ ఖాతాల పేర్లను ఇతరులు వాడకుండా ముందే రిజర్వ్ చేస్తామని వాట్సాప్ వివరించింది. దేశంలో వాట్సాప్‌నకు రూ.50 కోట్లకు పైగా యూజర్లు ఉన్నందున భద్రతపై రాజీ పడేది లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనలు, టెలిగ్రామ్ పైరసీ వ్యవహారాలపై కూడా కేంద్రం ఇటీవలే నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# కోర్ట్ ఆర్డర్ ధిక్కరిస్తూ పట్టా పాస్ బుక్

## 18 ఎకరాల భూమి అక్రమంగా పట్టా చేయించుకున్న మహిళ



**చుంచుపల్లి జులై 9 ( స్కై న్యూస్):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండా గ్రామ పంచాయతీలో తాతల నాటి పట్టాగలిగిన భూమి కోర్టు నాలుగు భాగాలుగా విభజించిన భూమి రక్తసంబంధీకులకు తెలియజేయకుండానే కోర్టు తీర్పుని లెక్కచేయకుండా పొత్తులో ఉన్న 18 ఎకరాలు పంట పొలం పట్టా చేయించుకున్న సంఘటన చుంచుపల్లి తండాలో చొటుచేసుకుంది పూర్తి వివరాల్లోకి వెళితే సుంకర శేషగిరి రావు 1942 వారి స్వార్జితం 18 ఎకరాల స్థలం. వారికి ఇద్దరు కొడుకులు సుంకర శివప్రసాద్ సుంకర ఉమా ప్రసాద్ 1998 లో 2 స్థలాలు ఇరువురుకి ఒక భాగం ఆనాడు పెద్దల సమక్షంలో రాసుకోవడం జరిగింది .2023 లో అనారోగ్యంతో ఉమా ప్రసాద్ చనిపోయినారు భార్య సుంకర మాలతి 2023లో కోర్టు ఆర్డర్ ద్వారా సర్వేయర్ చేసిన నాలుగు భాగాలు ఎవరికి తెలియజేయకుండా ఆ స్థలం మొత్తము సర్వేనెంబర్ 90/12 సర్వేనెంబర్ 90/ 9 వరకు పట్టా చేయించుకోవడం జరిగింది .కొత్తగూడెం డిస్టిక్ కోర్టు మండల సర్వేయర్ కి భాగాలుగా విభజించమని గత సంవత్సరం కోర్టు ఆర్డర్ ఇవ్వడం జరిగింది మేము హైదరాబాదులో ఉంటుండడంతో కోర్టు ఆదేశాలను సర్వేయర్ విభజించిన భాగాలను లెక్కచేయకుండా అధికారులకు తెలియజేయకుండా 18 ఎకరాలు నాదే అంటూ దొంగతనంగా సొంత వారిని అధికారులను మోసగించి పాస్ బుక్ చేయించుకోవడం జరిగింది. గత జనవరిలో మేము మొక్కజొన్న వేసినాము మొక్కజొన్న మొత్తం పాడు చేయడం జరిగింది. మేము ఆనాడు కంప్లైంట్ కూడా ఇవ్వడం జరిగింది అన్ని డాక్యుమెంట్లు కలిగి కోర్ట్ ఆర్డర్ ఉన్నప్పటికీ మా భూమిలోకి రావద్దంటూ మమ్ములను భయభ్రాంతులకు గురిచేస్తుంది కాబట్టి జిల్లా అధికారులు నిజా నిజాలు తెలుసుకొని సర్వే నెంబర్ 90/12 సర్వే నెంబర్ 90//9 లో ఉన్న మా భూమిని ఆమె పేరు మీద చేసిన పట్టా పాస్ బుక్ రద్దుచేసి మాకు చెందవలసిన భూమిని మాకు ఇప్పించవలసిందిగా కోరుచున్నాము

# గ్రామ పంచాయితి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమం







**కొత్తగూడెం జూలై 9 (స్కై న్యూస్ ):**కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయితి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా కొత్తగూడెం, ఇల్లందు వైరా నియోజక వర్గాలలోని అన్నీ గ్రామపంచాయితీల సర్పంచులకు గ్రామ కార్యదర్శులకు కొత్తగూడెం క్లబ్, కొత్తగూడెం నందు తేది. 09. జూలై .2026న ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించుట జరిగినది.ఇట్టి కార్యక్రమానికి కూనంనేని సాంబశివరావు శాసన సభ్యులు, కొత్తగూడెం నియోజకవర్గం కోరం కనకయ్య శాసన సభ్యులు, ఇల్లందు నియోజకవర్గం వారు కొత్తగూడెం క్లబ్, కొత్తగూడెం నందు హాజరు అయినారు.ఈ కార్యక్రమంలో శ్రీమతి యం. విద్యాచందన, డి.ఆర్.డి.ఓ., శ్రీమతి బి. నాగలక్ష్మి, జెడ్.పి. సి.ఇ.ఓ.,శ్రీమతి బి. అనూష, డి.పి. ఓ., ఇతర అధికారులు, సంబంధిత యం.పి.డి.ఓ.లు యం.పి.ఓ.లు హాజరు అయినారు.

## బిజినెస్

### హోండా కారుపై రూ.2.15 లక్షల డిస్కౌంట్!



జూలై 2026 నెలలో హోండా కార్స్ ఇండియా.. ఎంపిక చేసిన కొన్ని కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను, ప్రయోజనాలను ప్రకటించింది. ఇందులో నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ బెనిఫిట్స్ వంటి ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఈ ఆఫర్స్ కేవలం జూలై 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. హోండా ఎలివేట్ కారుపై కంపెనీ గరిష్టంగా రూ.2.15 లక్షల డిస్కౌంట్ అందిస్తోంది. ఇందులో రూ. 40,000 వరకు నగదు తగ్గింపు, రూ. 30,000 వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనం, కార్పొరేట్ ఆఫర్లు, లాయల్టీ ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణంగా హోండా ఎలివేట్ ధరలు రూ. 11.60 లక్షల నుంచి రూ. 16.16 లక్షల మధ్య ఉన్నాయి. అయితే ఇది దేశీయ విఫణిలో హ్యుందాయ్ క్రెటా , కియా సెల్టోస్ , టాటా సియెర్రా, మారుతి విక్టోరిస్, మారుతి గ్రాండ్ విటారా, రెనాల్ట్ డస్టర్‌లకు ప్రత్యర్థిగా ఉంటుంది. సెడాన్ల విభాగంలో కొత్త హోండా అమేజ్ కొనుగోలుపై రూ. 67,000 వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. హోండా అమేజ్ సెకండ్ జనరేషన్ మోడల్ మీద రూ. 58,000 వరకు డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ కొనుగోలుపైన ఎలాంటి తగ్గింపులు లేదు. ఎందుకంటే ఈ కారు ఇటీవలే షోరూమ్‌లలోకి వచ్చింది. చీశీవ: కంపెనీ అందించే డిస్కౌంట్స్ లేదా ప్రయోజనాలు నగరాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కాబట్టి కొనుగోలుదారులు మీరు కొనే కారుపై ఎంత డిస్కౌంట్ లభిస్తుంది అనే వివరాలను ఖచ్చితంగా తెలుసుకోవడానికి సమీపంలోని డీలర్షిప్ సందర్శించాలి.

### ఒక్కసారిగా రూ.60 వేలు..
### పెరిగిన విండ్సర్ ఈవీ ధర!

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. ఎంజీ ఇండియా తన విండ్సర్ ఈవీ ధరలను పెంచింది. జూలై 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ ధరల పెంపు అన్ని వేరియంట్లకు వర్తిస్తుంది. ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఇటీవల కియా, టయోటా వంటి ఇతర వాహన తయారీ సంస్థలు కూడా తమ కార్ల ధరలను పెంచిన నేపథ్యంలో ఎంజీ కూడా ఇదే బాటలో నడిచింది. ఎంజీ విండ్సర్ ఈవీ మొత్తం ఐదు వేరియంట్లలో అందుబాటులో ఉంది. వీటిలో ఎక్స్‌సైట్ బేస్ వేరియంట్‌పై అత్యధికంగా రూ.60,000 పెంపు జరిగింది. దీంతో దీని ధర రూ.14.10 లక్షల నుంచి రూ.14.70 లక్షలకు చేరింది. ఎక్స్‌క్లూజివ్ వేరియంట్ ధర రూ.46,900 పెరిగి రూ.16 లక్షలకు చేరగా, ఎసెన్స్ వేరియంట్ కూడా అదే మొత్తంతో పెరిగి రూ.17 లక్షలకు చేరింది. ఎక్స్‌క్లూజివ్ ప్రో వేరియంట్ ధర రూ.52,000 పెరిగి రూ.17.90 లక్షలకు చేరుకుంది. టాప్ వేరియంట్ అయిన ఎసెన్స్ ప్రో ధర రూ.40,000 పెరిగి రూ.19 లక్షలుగా నిర్ణయించారు. మొత్తం మీద వేరియంట్‌లను బట్టి ధరల పెంపు 2.15 శాతం నుంచి 4.26 శాతం వరకు పెరిగిందని స్పష్టమవుతోంది. ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపుతుందా?, లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# అదానీ గ్రూప్ భారీ ఆసుపత్రి..
# 1,000 బెడ్లు పేదలకు ఉచితం

పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్య రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగం పడకలను అంటే 1,000 బెడ్లను పేద రోగులకు పూర్తిగా ఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. గత శనివారం తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌర సమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం సువేందు అధికారి మాట్లాడారు. తమ ప్రభుత్వం గత రెండు నెలల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, అదానీ గ్రూప్ ఆసుపత్రి ఏర్పాటుకు లిఖితపూర్వక హామీ ఇచ్చిందని స్పష్టం చేశారు. ఈ ఆసుపత్రిలో 1,000 పడకలను పేదల ఉచిత వైద్యానికి, మిగిలిన 1,000 పడకలను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తారని ఆయన వివరించారు. అదానీ గ్రూప్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో పలు కార్యక్రమాలు చేపడుతోంది. గతంలో బీహార్‌లో అఖండ జ్యోతి ఆసుపత్రితో కలిసి 'అదానీ సెంటర్ ఫర్ ఐ డిసీజెస్'ను ప్రారంభించింది. ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీలో కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్స ప్రాజెక్టును కూడా విస్తరించింది. ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. "ఒక వ్యక్తికి కంటిచూపు ఇవ్వడమంటే కేవలం వైద్యం అందించడం కాదు, వారి జీవితంలోకి ఆశ, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం" అని అన్నారు. కోల్‌కతాలో ఏర్పాటు చేయనున్న ఈ కొత్త ఆసుపత్రి, అదానీ గ్రూప్ ఆరోగ్య సేవల విస్తరణలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.




# బంగారు అభరణాలపై రుణం తీసుకుంటున్నారా?
# ఈ పొరపాట్లు అస్సలు చేయొద్దు!

ఇటీవల కాలంలో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరిగినప్పటికీ ప్రస్తుతం ధరలు క్రమంగా దిగి వస్తున్నాయి. అయితే బంగారానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. మహిళలకు ధరించేందుకు వాడుకోవడమే కాకుండా కష్ట సమయాల్లో ఎంతగానో ఆదుకుంటుంది. అత్యవసరంగా నగదు అవసరమైన వారు తమ బంగారు ఆభరణాలను అమ్మకుండా వాటిని తాకట్టు పెట్టి గోల్డ్ లోన్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం, వ్యాపార అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులు లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం చాలామంది గోల్డ్ లోన్‌ను ఎంచుకుంటున్నారు. బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా తక్కువ సమయంలో రుణం మంజూరు చేయడం వల్ల ఈ రుణాలకు డిమాండ్ మరింత పెరుగుతోంది. నిపుణుల వివరాల ప్రకారం.. బంగారంపై రుణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల విడుదలైన ఎక్స్‌పీరియన్ నివేదిక ప్రకారం, భారతదేశంలో రిటైల్ రుణాల వృద్ధికి ప్రస్తుతం గోల్డ్ లోన్లు ప్రధాన కారణంగా మారాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రిటైల్ రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా 18 శాతంగా ఉండగా, 2026 నాటికి అది 41 శాతానికి చేరిందని నివేదిక చెబుతున్నాయి. గత ఐదేళ్లలో అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు దాదాపు 130 శాతం వరకు పెరగడం కూడా దీనికి ప్రధాన కారణంగా పేర్కొంది. బంగారం విలువ పెరగడంతో అదే ఆభరణాలపై రుణగ్రహీతలు మరింత ఎక్కువ మొత్తాన్ని పొందగలుగుతున్నారు. ఇప్పుడు మీకు బంగారంపై ఎక్కువ రుణం లభించే అవకాశాల ఉన్నాయి. మీరు బ్యాంకుల్లో గానీ, ఇతర సంస్థల్లో గానీ బంగారంపై రుణం పొందాలనుకుంటే గతంలో కంటే అధిక మొత్తంలో రుణం మంజూరు చేసే అవకాశం ఉంది. 2024 జనవరి-మార్చి త్రైమాసికంలో గోల్డ్ లోన్ల పంపిణీ విలువ రూ.483 కోట్లుగా ఉండగా, 2026 ఇదే కాలానికి అది రూ.981 కోట్లకు పెరిగింది. మీరు మొదటిసారి బంగా రంపై రుణం తీసుకుంటున్నట్లయితే ఈ పొరపాట్లు అస్సలు చేయవద్దని సూచిస్తున్నారు నిపుణులు. వారు చేసే సాధారణ తప్పుల్లో ఒకటి గరిష్టంగా ఎంత రుణం వస్తుందనే అంశానికే ప్రాధాన్యత ఇవ్వడం. కానీ రుణం తీసుకునేటప్పుడు మొత్తం ఖర్చును కూడా పరిశీలించడం చాలా ముఖ్యం.



# ఇంగ్లండ్ కల చెదిరింది
## ఏడో టీ20 వరల్డ్‌కప్‌తో మురిసిన ఆస్ట్రేలియా..!






మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అద్భుతం జరగలేదు. ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా జోరుకు తలొగ్గిన ఇంగ్లండ్ కప్‌ను అప్పగించింది. లార్డ్స్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో రెచ్చిపోయిన ఆసీస్ రికార్డు స్థాయిలో ఏడోసారి పొట్టి కప్‌ను ముద్దాడింది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 151 లక్ష్య ఛేదనలో బేత్ మూనీ(64), ఫొబో లిచ్‌ఫీల్డ్0(48) ఉతికేశారు. పవర్ ప్లేలోనే 62 కొట్టిన కంగారూ టీమ్.. 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. నాలుగోసారి పొట్టి కప్ ఫైనల్లో కంగుతిన్న ఇంగ్లండ్ సొంతగడ్డపై చెక్కుచెదరని రికార్డును చేజేతులా పోగొట్టుకుంది. ఐసీసీ ఈవెంట్లలో తామెంత ప్రమాదకరమో ఆస్ట్రేలియా మరోసారి చాటింది. ఫైనల్ వెళ్తే కప్ వదలేది లేదు అన్నట్టు ఆడే ఆసీస్.. ఏడోసారి టీ20 ప్రపంచకప్‌ను ఒడిసిపట్టింది. లీగ్ దశ నుంచి ఓటమెరుగని ఇంగ్లండ్‌ను సొంతగడ్డపై మట్టికరిపించిన కంగారూ టీమ్ తమ స్టయిల్లో విశ్వవిజేతగా నిలిచింది. ఆదివారం లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌ను బంతితో నిలువరించిన ఆస్ట్రేలియా బ్యాటతో రెచ్చిపోయింది. 151 పరుగుల మోస్తరు ఛేదనను ఆసీస్ దూకుడుగా మొదలెట్టింది. తొలి బంతినే బౌండరీకి పంపిన ఓపెనర్ జార్జియా వోల్(9)ను లారెన్ బెల్ బౌల్డ్ చేసి ఆదిలోనే బ్రేకిచ్చింది. కానీ, బిగ్ మ్యాచ్ ప్లేయర్ బేత్ మూనీ(64) ఒత్తిడికి లోనవ్వకుండా ఫొబే లిచ్‌ఫీల్డ్(48)తో కలిసి దంచేసింది. వీరిద్దరి ఉతుకుడుతో ఆసీస్ పవర్ ప్లేలో 62 పరుగులు చేసింది. శతక బాగస్వ్షా?వ్యం నెలకొల్పిన లిచ్‌ఫీల్డ్‌ను డీన్ బౌల్డ్ చేసింది. కానీ, అప్పటికే ఆసీస్ విజయం వాకిట నిలిచింది. ఎలీసా పెర్రీ(13 నాటౌట్) జతగా లాంఛనం ముగించాలనుకున్న మూనీ ఎల్బీగా వెనుదిరిగింది. గార్డ్‌నర్(5 నాటౌట్) బౌండరీతో ఆసీస్ ఏడు వికెట్లతో విజయం సాధించింది.

### బ్రంట్ అర్ధ శతకంతో

టాస్ ఓడిన ఇంగ్లండ్‌కు ఫైనల్లో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ అమీ జోన్స్(6)ను ల్యూసీ హామిల్టన్ ఔట్ చేయగా.. డేంజరస్ డాని వ్యాట్ హెడ్జ్(8) సైతం విఫలమైంది. టపటపా రెండు కీలక వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(58 నాటౌట్) బాధ్యతగా ఆడింది. ఒత్తిడిలోనూ ధనాధన్ ఆడిన అలలీసే క్యాప్సే(23) ఆసీస్ బౌలర్ల లయను దెబ్బతీసింది. అయితే.. గార్డ్‌నర్ వేసిన 9 ఓవర్లో క్యాప్సే 6, 4, 4 తో 16 రన్స్ పిండుకోగా స్కోర్ 60 దాటింది. అదే విధంగా ధాటిగా ఆడే క్రమంలో మొలినెక్స్ వేసిన బంతిని స్కూప్ చేయబోయి క్యాప్సే బౌల్డయ్యింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే హీథర్ నైట్(2) వికెట్ల ముందు దొరికిపోయింది. అంతే.. ఇంగ్లండ్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. చూస్తుండగానే నాలుగు వికెట్లు పడినా.. కెప్టెన్ బ్రంట్ పట్టువదల్లేదు. ఫ్రెయా కెంప్(44 నాటౌట్)తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించింది. తొలుత సింగిల్స్, డబుల్స్ తీసిన కెంప్ కాస్త కుదురుకున్నాక బౌండరీలతో స్కోర్ వేగం పెంచింది. సథర్‌లాండ్ ఓవర్లో తను రెండు ఫోర్లు బాదగా స్కోర్ వందకు చేరింది. ధాటిగా ఆడి 37 బంతుల్లో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిందీ జంట. మొలినెక్స్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో కెంప్ స్ట్రెయిట్ సిక్సర్‌తో ఆతిథ్య జట్టు 4 నష్టానికి 150 పరుగులు చేయగలిగింది.

## స్పోర్ట్స్

### క్వార్టర్ ఫైనల్లో జకోవిచ్..
### ఫెదరర్ ఆల్‌టైమ్ రికార్డు బద్ధలు..!




వింబుల్డన్‌లో నొవాక్ జకోవిచ్ జోరు చూపిస్తున్నాడు. పురుషుల సింగిల్స్‌లో అతడు క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఆదివారం హోరాహోరీగా జరిగిన ప్రీ-క్వార్టర్స్ పోరులో రోమన్ సఫీల్లిన్(రష్యా)ను చిత్తు చేశాడు. ఈ విక్టరీతో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్(=శీస్త్రవతీ ఖీవఎవతీవతీ) ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టాడు జకో. వింబుల్డన్‌లో 106వ విజయంతో ఫెదరర్‌ను అధిగమించాడీ సెర్బియా స్టార్. ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ జకోవిచ్ ఈసారి చెలరేగిపోతున్నాడు. 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి పెట్టిన జకో.. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరుకున్నాడు. రోమన్ సఫీల్లిన్(రష్యా) నుంచి గట్టి పోటీ ఎదురైనా చివరకు.. 7-6(6), 6-3, 3-6, 6-3తో గెలుపొందిన అతడు ఫెదరర్ పేరిట ఉన్న అత్యధిక విజయాల(105) రికార్డును తన వశం చేసుకున్నాడు. ఆదివారం సెంటర్ కోర్టులో రోమన్‌ను ఓడించడం ద్వారా ఈ మాజీ విజేత ఈ గ్రాస్ కోర్టు టోర్నీలో 106వ విజయం నమోదు చేశాడు. ఓపెన్ ఎరాలో ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఇన్నేసి విక్టరీలు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.



# ‘అయ్యగారే నెం.1’ నినాదంపై అఖిల్ స్పందన.. నాకు నంబర్ వన్ కావాలనే లక్ష్యం లేదంటూ కామెంట్


అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘లెనిన్’ విడుదలకు సిద్ధమవుతోంది. జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ తన సినీ ప్రయాణం, అభిమానులతో ఉన్న అనుబంధం, కెరీర్‌పై తన ఆలోచనలను పంచుకుంటున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో “అయ్యగారే నెం. 1” అనే నినాదంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో “అయ్యగారే నెం. 1c అంటూ వైరల్ అయిన అభిమాని గురించి మాట్లాడుతూ అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఒక అభిమాని తనపై చూపించిన ప్రేమ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్కడికి వెళ్లినా అందరూ ‘అయ్యగారు... అయ్యగారు’ అని పిలుస్తున్నారు. ఈ పేరు నాకు అభిమానులు ఇచ్చిన ప్రేమకు నిదర్శనం. నాన్న నాగార్జునకు ‘కింగ్’ అనే ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లే, నాకు ‘అయ్యగారు’ అనే పేరు సహజంగానే వచ్చేసింది. ఇది నాకు ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు” అని అఖిల్ చెప్పారు. అభిమానులు తరచూ “అయ్యగారే నెం. 1c అని అనడం గురించి స్పందిస్తూ అఖిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజం చెప్పాలంటే ‘నంబర్ వన్’ కావాలనే లక్ష్యం నాకు లేదు. నంబర్ వన్ అనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. ఒకరికి నంబర్ వన్ అనిపించే వ్యక్తి, మరొకరికి కాకపోవచ్చు. అందుకే ఆ పోలికల గురించి నేను ఎక్కువగా ఆలోచించను” అని స్పష్టం చేశారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ తనకు మరింత బాధ్యతను పెంచుతుందని అఖిల్ అన్నారు. అభిమానులు నాపై ఇంత ప్రేమ చూపిస్తున్నప్పుడు, వారి అంచనాలను అందుకోవాలనే బాధ్యత కూడా నాపై ఉంటుంది. వారి ప్రేమ, ఉత్సాహం నాకు మరింత కష్టపడేలా ప్రేరణ ఇస్తాయి. వారిని ఎప్పుడూ నిరాశపరచకూడదనేదే నా ప్రయత్నం అని చెప్పారు. తెలుగు సినీ అభిమానుల్లో కొన్ని ప్రత్యేక నినాదాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని చెబుతూ, “జై బాలయ్య” తరహాలో “అయ్యగారే నెం. 1” కూడా తనతో ఎప్పటికీ ముడిపడి ఉండిపోతుందని అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో తన గత చిత్రాలైన ‘హలో’, ‘మిస్టర్ మజ్ను’, ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’ గురించి కూడా అఖిల్ మాట్లాడారు. ఆ సినిమాల్లో తాను పోషించిన పాత్రలు మహిళలను గౌరవించే యువకులుగా ఉండటం తనకు ఎంతో నచ్చిందన్నారు. ముఖ్యంగా ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’ చిత్రంలోని హర్ష పాత్ర గురించి మాట్లాడుతూ, ఆ పాత్రలో ఉన్న విలువలు ప్రతి అమ్మాయి కోరుకునే లక్షణాలు. అలాంటి పాత్ర చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది అని తెలిపారు.



# ఓఆర్ఆర్ వద్ద పది ఎకరాలు కొనొచ్చు

సత్యదేవ్ హీరోగా వచ్చిన లేటేస్ట్ మూవీ రావు బహదూర్. ఈ నెల 3న థియేటర్లలో రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సక్సెస్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జంటగా దీపా థామస్ హీరోయిన్‌గా మెప్పించింది. ఈ మూవీకి కేరాఫ్ కంచరపాలెం ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. మహేశ్ బాబు–నమ్రతా శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్ మెంట్ సమర్పణలో ఏ ప్లస్ ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్స్ చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. ఈనెల 3న థియేటర్లలో రిలీజైన ఈ ?సినిమాకు తొలిరోజు నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. హిట్ టాక్ రావడంతో జనాలు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూవీ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు హాజరైన సత్యదేవ్ తన సినిమాల గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. గతంలో తన మూవీస్ చాలా నిరాశ పరిచాయని అన్నారు. రావు బహదూర్ లాంటి గొప్ప సినిమాను చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సత్యదేవ్ మాట్లాడుతూ..’ గతంలో నా సినిమాలు వచ్చినప్పుడు .. ఇది వర్కవుట్ అవుతుందని చెప్పేవారు. అంతేకాదు ఈ మూవీ హిట్ అయితే మీరు ఓఆర్ఆర్ వద్ద ఓ పది ఎకరాలు కొనొచ్చు అనేవారు. నాకు డిసప్పాయింట్‌మెంట్ అనేది కొత్త కాదు. దాంతో నేను, మహా సహజీవనం చేస్తుంటాం. సక్సెస్ అనేది కొత్త. ఈ రోజు సక్సెస్ వచ్చింది అనే పాయింట్ కంటే.. ఈ సినిమా జనాలు చూడకపోతే ఒక గొప్ప చిత్రాన్ని కోల్పోతారనే ఫీలింగ్ వచ్చింది. ఈ మూవీ జనాలు చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది’ అని అన్నారు.






# ‘ఫౌజీ’ విజువల్స్ చూసి మైండ్ బ్లాక్ అయింది..

## ప్రభాస్ సినిమాపై నాగవంశీ షాకింగ్ కామెంట్స్!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, ‘సీతారామం’ ఫేమ్ దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో రాబోతున్న హిస్టారికల్ పీరియడ్ వార్ అండ్ లవ్ డ్రామా ‘ఫౌజీ’పై రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హను రాఘవపూడి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ పాన్–ఇండియా విజువల్ వండర్‌ను నిర్మిస్తోంది. వచ్చే వింటర్ కానుకగా, డిసెంబర్ 2026లో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ పంచుకున్న ఒక క్రేజీ అప్‌డేట్ ప్రభాస్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ తనకు ‘ఫౌజీ’ సినిమాకు సంబంధించిన కొన్ని రషెస్ చూపించారని, అవి చూశాక తనకు మైండ్ బ్లాక్ అయిందని నాగవంశీ పేర్కొన్నారు. చిత్ర యూనిట్ ఈ సినిమాను మనం ఊహించని రేంజ్‌లో, ఒక సరికొత్త హాలీవుడ్ లెవెల్‌లో తెరకెక్కిస్తోందని ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. నాగవంశీ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో నిమిషాల్లో వైరల్‌గా మారడంతో, ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే సినిమా ప్రమోషన్స్ షురూ చేయాలని, అఫీషియల్ టీజర్ లేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలంటూ ఫ్యాన్స్ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు. ఈ అద్భుతమైన చిత్రంతో సోషల్ మీడియా సెన్సేషన్ ఇమాన్వి హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతుండటం విశేషం. అలాగే బాలీవుడ్ దిగ్గజ నటులు మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, సీనియర్ నటి జయప్రద, రాహుల్ రవీంద్రన్, చైత్ర జె. ఆచార్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించబోతుందో చూడాలి.



# ‘రౌడీ జనార్దన’లో బాలీవుడ్ భామ.. లైగర్ బ్యూటీతో మళ్లీ రౌడీ స్టార్ రొమాన్స్?

టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ, క్రేజీ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘రౌడీ జనార్దన’ గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. పక్కా గ్రామీణ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత, స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ఒక అదిరిపోయే మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే స్టెప్పులు వేయబోతున్నట్లు గట్టిగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ ‘లైగర్’ సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే, ఒకవేళ ఈ వార్త నిజమైతే మరోసారి ఈ జోడి వెండితెరపై సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఆఫర్‌కు అనన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా ఉంటాయని ఇన్సైడ్ టాక్. ముఖ్యంగా ఈ ఫ్లాష్ బ్యాక్‌లో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఊరమాస్ లుక్‌తో కనిపించబోతున్నాడట. ఇందులో వచ్చే యాక్షన్ సీక్వెన్సులు సినిమా మొత్తానికే మేజర్ హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో సీనియర్ యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రతో పాటు లుక్ కూడా ఇప్పటివరకు మనం చూడని రీతిలో సరికొత్తగా, ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. మొత్తానికి భారీ తారాగణం, అదిరిపోయే యాక్షన్ ఎలిమెంట్స్, విలేజ్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కుతున్న ‘రౌడీ జనార్దన’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను సృష్టిస్తుందో చూడాలి.

# పేదల ఆత్మగౌరవాన్ని పెంచే ఇందిరమ్మ ఇండ్లు

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం**

**మహబూబ్ నగర్, జులై 8(స్త్రైన్యూస్ ):**పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా ఇందిరమ్మ ఇండ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ నగరంలోని ఒకటవ డివిజన్ జైనల్లిపూర్ లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల మనోభావాలతో చెలగాటం ఆడిందని ఆరోపించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని, ఇందిరమ్మ ఇండ్ల ద్వారా వారికి సొంతింటి కలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా వేలాది



మంది పేద కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని ఆయన అన్నారు. ఈ



కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కార్పొరేటర్ దేవ్లీ మేఘ్యానాయక్, నాయకులు నర్సింహులు, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం మైదానంలో నూతన ఐరన్ షెడ్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ జులై 9,(స్త్రైన్యూస్ )** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ మైదానంలో నూతనంగా నిర్మించిన ఐరన్ షెడ్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, సమక్షంలో ప్రారంభించారు.ఈ ఐరన్ షెడ్ నిర్మాణానికి గతంలో విధులు నిర్వహించిన జిల్లా కలెక్టర్ చొరవతో డీఎంఎఫ్‌టీ నిధుల నుండి మంజూరు చేయడం జరిగిందని, ఆ నిధులతో ఈ నిర్మాణం పూర్తయి నేడు ప్రజలకు, పోలీసు శాఖకు ఉపయోగపడే విధంగా అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి , సమర్థవంతమైన పరిపాలనలో అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. జిల్లా యంత్రాంగంలోని వివిధ శాఖల మధ్య సమన్వయం, సహకారం ఉండటం వల్ల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు. పోలీసు శాఖ ప్రజా భద్రత కోసం నిరంతరం సేవలందిస్తోందని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.అనంతరం జిల్లా ఎస్పీ డి.జానకి, మాట్లాడుతూ,



పోలీసు శాఖ అవసరాలను గుర్తించి డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా మంజూరు చేసి ఐరన్ షెడ్ నిర్మాణానికి సహకరించిన జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, యూనిట్ల నుండి సిబ్బంది తరచూ అధికారిక విధుల నిమిత్తం వస్తుంటారని, వారు వేచి ఉండే సమయంలో ఎండ, వర్షం వంటి ఇబ్బందులు లేకుండా ఈ ఐరన్ షెడ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పోలీసు



పరేడ్‌లు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర అధికారిక కార్యక్రమాల నిర్వహణకు కూడా ఈ షెడ్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, వర్టికల్ డీఎస్పీ బాలాజీ, ఆర్ఐలు కృష్ణయ్య, నాగేష్, అశోక్ కుమార్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన 'కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్'కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం



మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

# తప్పులు సవరించుకున్న ఎన్‌సీఈఆర్‌టీ

**న్యూఢిల్లీ:** న్యాయవ్యవస్థపై ఆరోపణలతో వివాదాలకెక్కిన జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎట్టకేలకు తన తప్పులను దిద్దుకుంది. తాజాగా విడు దల చేసిన ఎనిమిదవ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో వివాదాస్పద భాగాలను తొలగించింది. కాకపోతే కొత్త పుస్తకంలోనూ కొన్ని సవరణలు చేసింది. దేశ విభజన విషయంలో కాంగ్రెస్ వైఖరిని వక్రీకరించింది. వీర్ సావర్కర్ స్వరాజ్ కోసం డిమాండ్ చేశాడన్న విషయాన్ని జోడించింది. జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్, నాజీ సిద్ధాంతాల ప్రస్తావనను తొలగించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్‌సీఈఆర్‌టీ "ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్'పేరుతో విడుదల చేసిన పాఠ్యపుస్తకంపై పెద్ద ఎత్తున దుమారం రేగిన విషయం తెలిసిందే. ఇందులోని ఒక అధ్యాయనంలో న్యాయవ్యవస్థలో అవినీతి, పెండింగ్ కేసుల ప్రస్తావనలు ఉండటం వివాదాస్పదమైంది. సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని పుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. ఏ రకంగానూ ఈ వివాదాస్పద పుస్తకం మళ్లీ ముద్రించకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌సీఈఆర్‌టీ కూడా సుప్రీంకోర్టును క్షమాపణలు కోరింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే ఆ పాఠ్యపుస్తకాన్ని సమీక్షించింది. సవరణలతో కూడిన పుస్తకం ఇటీవలే అందుబాటులోకి వచ్చింది.




**చేసిన మార్పులేమిటి?**

స్వాతంత్రోద్యమం, దేశ విభజనకు సంబంధించి ఈ పుస్తకంలో 'ఇండియాస్ లాంగ్‌రోడ్ టు ఇండిపెండెన్స్'పేరుతో ఒక అధ్యాయం ఉంది. అందులో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కూడా దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించినట్లుగా రాశారు. అలాగే స్వాతంత్ర్యం సంపాదించేందుకు దేశ విభజన ఒక్కటే మార్గమన్న విధానాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకోవడం చర్చనీయాంశమని కూడా ఉంది. విభజన సమయంలో భారత ఉపఖండంలో మతహింసలు చెలరేగగా కాంగ్రెస్ అసహాయ స్థితిలో ఉండిపోయిందన్న వ్యాఖ్యను తొలగించారు. హిందూ, ముస్లిం నేతల మధ్య ఉన్న అభిప్రాయభేదాలను తమకు అనుకూలంగా మార్చుకున్న బ్రిటిష్ పాలకులు దేశాన్ని విభజించాలని నిర్ణయించారని, మహాత్మగాంధీ సహా కాంగ్రెస్ నేతలు కూడా విభజనను వ్యతిరేకించారని, కానీ చివరకు ముందుకెళ్లేందుకు అదొక్కటే మార్గమని అంగీకరించారన్న విషయాలను కూడా కొత్త పుస్తకంలో చేర్చలేదు. కొత్త పుస్తకంలో సంపూర్ణ స్వరాజ్యం డిమాండ్‌కు మరిన్ని వివరాలు జోడిస్తూ... 1925లో వీర్ సావర్కర్ కూడా స్వరాజ్ కోసం డిమాండ్ చేసినట్టుగా రాశారు. ఫిబ్రవరిలో ప్రచురితమైన పుస్తకంలో స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ సాయుధ దళాన్ని అభివృద్ధి చేసేందుకు హిట్లర్ సాయం కోరినట్టు ఉంది. అలాగే హిట్లర్ నాజీ భావజాలం, విస్తరణవాదం ఫలితంగానే రెండో ప్రపంచయుద్ధం జరిగిందన్న వివరమూ కొత్త పుస్తకంలో లేకుండా చేశారు. సుభాష్ చంద్రబోస్ బ్రిటిష్ వ్యతిరేక శక్తుల సాయం కోరాడని మాత్రమే ఉంచారు. న్యాయవ్యవస్థకు సంబంధించిన 'ద రోల్ ఆఫ్ జ్యుడిషరీ ఇన్ సొసైటీ'లో వివాదాస్పద అంశాలను తొలగించిన ఎన్‌సీఈఆర్‌టీ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, ట్రైబ్యునల్స్, ప్రత్యామ్నాయ విభేద పరిష్కార పద్ధతుల సమాచారం జోడించింది. సమాజంలో వివక్షకు కులం, మతం, జాతి, లింగం, వైకల్యం, లైంగికతవి కారణమవుతున్నాయని ఫిబ్రవరిలో ప్రచురితమైన పుస్తకంలో ఉండగా కొత్తదాంట్లో "ఆర్థిక నేపథ్యం"అనే అంశాన్ని చేర్చారు. 'సిటిజన్‌షిప్: రైట్స్ అండ్ డ్యూటీస్'అన్న అధ్యాయంలో వివక్ష అనేది అనైతికమైంది మాత్రమే కాకుండా చట్టపరంగానూ నిషేధించిందని స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాల నుంచి వచ్చిన వారు కూడా వివక్ష ఎదుర్కొనే అవకాశం ఉందని చెప్పారు. ఇటీవల యూజీసీ 2026 సమానత నియమావళి పై జరిగిన చర్చలో ఆర్థిక వెనుకబడిన స్థితి స్పష్టంగా రక్షిత వర్గంగా పేర్కొనలేదన్న విమర్శల మధ్య ఈ మార్పునకు ప్రాధాన్యమేర్పడింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రస్తావన పాఠ్యపుస్తకంలో, ఈ పుస్తకం సుప్రీం కోర్టు రిట్ పిటిషన్ (సివిల్) నెం: 1/2026 ద్వారా ఇచ్చిన ఆదేశాల మేరకు మళ్లీ ప్రచురించామని ఎన్‌సీఈఆర్‌టీ స్పష్టం చేసింది. కొత్త పుస్తకం తయారీలో పాల్గొన్న రచయితల సంఖ్య 51 నుంచి 48కి తగ్గింది.

## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. 'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు. ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.

## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా దేశ సాంస్కృతిక వారసత్వపు ఛాయలే



భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి దాదాపు 1,000 సంవత్సరాల పురాతన చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించారు. త్రిమూర్తులైన శివుడు, విష్ణువు, బ్రహ్మలు కొలువైన ఈ గుడిలో మోదీ పూజలు చేశారు. అనంతరం ఇరు దేశాధినేతలు కలిసి ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రంబనన్ హిందూ దేవాలయాల సముదాయానికి సంబంధించిన అద్భుతమైన వైమానిక దృశ్యాలను (ఏరియల్ వ్యూ) 'ఎక్స్'లో షేర్ చేశారు మోదీ. ఈ యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడానికి 'అద్భుతమైన ప్రంబనన్ ఆలయం!' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ప్రధాని మోదీ ప్రంబనన్ ఆలయ సందర్శన ఈ విశాలమైన గుడి ప్రాంగణంలో భారత్ సాయంతో చేపట్టే పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి మార్గం సుగమం చేసింది. ఇది యాక్ట్ ఈస్ట్ పాలసీ కింద భారత సాంస్కృతిక దౌత్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇదే ప్రాజెక్ట్‌పై ప్రధాని మోదీ, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవోల మంగళవారం విస్తృత ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ పరిరక్షణ ప్రాజెక్ట్ కోసం ఇద్దరు నాయకులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) పరస్పరం మార్చుకున్నారు. యోగ్యకార్తాలోని ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా అక్కడ భారతదేశ సాంస్కృతిక వారసత్వపు ఛాయలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆగ్నేయాసియాలో భారత వారసత్వానికి ప్రంబనన్ ఆలయం రెండో అతిపెద్ద గుర్తింపని తెలిపారు. ఈ ఆలయంలో శివుడు, దుర్గాదేవి, గణేషుడి విగ్రహాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ గుడిలో శతాబ్దాలుగా పూజలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈరోజు తాను కూడా ప్రంబనన్ ఆలయాన్ని దర్శించుకున్నానని చెప్పారు. అక్కడ పూజలు చేసే అవకాశం తనకు లభించిందన్నారు. గుడి పునరుద్ధరణ పనులు పూర్తైన తర్వాత తాను మళ్లీ ఈ గుడి వస్తానని వాగ్దానం చేశారు.

"నేను ఇండోనేసియా వచ్చి ఇది మూడో రోజు. అయినా ఇక్కడి సంభాషణల్లో, గాలిలో సాంస్కృతిక పరిమళం అలముకుంది. భారతదేశంలో మనం ప్రతి క్షణం అనుభవించే పరిమళం ఇది. ఈ సాంస్కృతిక వారసత్వ పరిమళం ఇరుదేశాల ప్రజలను ఒకరికొకర్ని అనుసంధానిస్తుంది. ఈ వారసత్వాన్ని పరిరక్షించిన ఇండోనేసియా ప్రజలకు, నాయకులకు ధన్యవాదాలు. ప్రంబనన్ గుడిలో పరమశివునితో అనుసంధానమయ్యే అవకాశం నాకు లభించడం నా అదృష్టం. హట్కేశ్వర్ మహాదేవ్ ఆలయం ఉన్న వాద్‌నగర్‌లో నేను జన్మించాను. సోమనాథ్ జ్యోతిర్లింగం ప్రపంచంలోనే మొదటి జ్యోతిర్లింగం. అది గుజరాత్‌లో ఉంది. నేను ఎంపీగా గెలుపొందిన నియోజకవర్గం వారణాసిలో కాశీ విశ్వనాథుడి ఆలయం ఉంది. ఆయన ఆశీస్సులు నాకు నిరంతరం లభిస్తున్నాయి. ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ పనులను ప్రారంభించే అవకాశం నాకు లభించింది. దీనిని నేను గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను." అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

గుడి చరిత్ర ఏంటంటే?

జావా ద్వీపంలో ఉన్న ప్రంబనన్ ఆలయాన్ని 9వ శతాబ్దంలో నిర్మించారు. ఇది ఇండోనేసియాలో అతిపెద్ద హిందూ గుడి. కంబోడియాలో ఉన్న అంగ్‌కోర్‌వాట్ తర్వాత ఆగ్నేయాసియాలో ఇదే పెద్ద దేవాలయం. దాదాపు 40 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ గుడి ప్రాంగణంలో మొదట సుమారు 240 ఆలయాలు ఉండేవి. ఈ గుడి నిర్మాణాన్ని హిందూ మాతారామ్ రాజవంశానికి చెందిన రాజు రాకై పికాతన్ ప్రారంభించగా, ఆయన వారసుడు లోకపాల పూర్తి చేశారు. ఇక్కడి శివ, విష్ణు, బ్రహ్మ ఆలయాలలో 47 మీటర్ల ఎత్తున్న ప్రధాన శివాలయం అత్యంత ప్రముఖమైనది. ఈ ఆలయ గోడలపై చెక్కిన రామాయణ గాథ శిల్పాలు భారత్-ఇండోనేసియాల ప్రాచీన నాగరికత బంధానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. ఈ గుడిని యూనెస్కో 1991లో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.

**పర్యటనలో కీలక ఘట్టాలతో వీడియో**

మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ తన ఇండోనేసియా పర్యటనలో ముఖ్యాంశాలను ప్రదర్శిస్తూ ఓ వీడియోను పంచుకున్నారు. ఇండోనేసియాలో తనకు లభించిన ఘన స్వాగతం, ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ప్రవాస భారతీయులతో తాను జరిపిన సమావేశాలలోని కీలక ఘట్టాలను ఆ వీడియోలో పొందుపర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ఇండోనేసియా పిల్లలు భారత్, ఇండోనేసియా జెండాలను ఊపుతూ 'స్వాగతం మోదీజీ', 'ఐ లవ్ యూ మోదీజీ' అంటూ నినాదాలు చేస్తూ ప్రధానికి స్వాగతం పలకడంతో ఈ వీడియో ప్రారంభమైంది. జకార్తాలోని అధ్యక్ష భవనంలో ఘన స్వాగత కార్యక్రమం, గౌరవ వందనం, సైనిక కవాతు, ఇరు దేశాధినేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశాలు కూడా ఈ వీడియోలో ఉన్నాయి.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137